# ఉద్యమ కెరటం

www.udyamakeratam.com

నిజం.. రక్షతి రక్షితః

తెలుగు దినపత్రిక

UDYAMA KERATAM TELUGU DAILY



www.udyamakeratam.com

ఉద్యమ కెరటం

రిపోర్టర్లు కావలెను

ఉద్యమ కెరటం దిన పత్రిక లో పని చేయుటకు
జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ, మండల రిపోర్టర్లు కావలెను.

మీ ప్రాంతాలకు సంబంధించిన రాజకీయాలు, సామాజిక, ఇతర అంశాల పై
లోతైన విశ్లేషణలు, రాయగల సామర్థ్యం కలిగి ఉండాలి.
ఆసక్తి గలవారు ఈ క్రింది నెంబర్, ఈ-మెయిల్‌కు తమ బయోడేటాను పంపగలరు.

సెల్: 9030717172

E-mail: udyamakeratamtelugudaily@gmail.com



5.2.2025 బుధవారం Wednesday | సంపుటి (Volume): 1 సంచిక (Issue) : 271 | పేజీలు : 9 Pages : 9 | వెల: 5 RNI: TELTEL12329 | Published from : Asifabad, Circulated to : Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahbubnagar, Medak, Nizambad, Rangareddy




టీజీపీఎస్సీ గ్రూప్ 1 మెయిన్స్ ఫలితాలకు

## మార్గం సుగమం

02



ఫిరాయింపుదారులకు

## షాక్

- సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు నోటీసులు


02



1.55 కోట్ల మంది

## ఉపాధిహామీ కార్మికుల తొలగింపు

02




చైనా దురాక్రమణలో

## భారత్ భూభాగాలు

02

- రాహుల్ వ్యాఖ్యలపై మండిపడ్డ రాజ్‌నాథ్ సింగ్



సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేకు శాసనసభ ఆమోదించిన నేపథ్యంలో ముఖ్యమంత్రికి అభినందనలు తెలుపుతున్న మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు

# బీసీల లబ్ధియే లక్ష్యం

## పార్టీ పరంగా స్థానిక ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు ఇస్తాం



### ఏటా గుర్తు పెట్టుకోవాలి

- ఫిబ్రవరి 4న "సామాజిక న్యాయ దినోత్సవం"గా జరుపుకోవాలి
- సీఎం రేవంత్‌రెడ్డి పిలుపు

02

- విపక్ష పార్టీలు ఇందుకు సిద్ధంగా ఉన్నాయా చెప్పాలి
- దేశంలోనే తొలిసారిగా కులగణన సర్వే చేపట్టాం
- నివేదికను అసెంబ్లీలో ప్రవేశ పెట్టిన సిఎం రేవంత్ రెడ్డి

తెలంగాణ అసెంబ్లీ ప్రత్యేక సమావేశంలో కులగణన సర్వేను సీఎం రేవంత్ రెడ్డి ప్రవేశపెట్టారు. ఇచ్చిన మాట ప్రకారం రాష్ట్ర వ్యాప్తంగా సమగ్ర కుటుంబ సర్వే, కుల గణన చేపట్టామని ముఖ్యమంత్రి తెలిపారు. వెనుకబడిన వర్గాల అభ్యున్నతి కోసం కులగణన సర్వే చేపట్టినట్లు వెల్లడించారు. రాష్ట్రంలో 66 లక్షల 99 వేల 602 కుటుంబాల సమాచారం సేకరించామని, తెలంగాణలో 96.9 శాతం సర్వే పూర్తి చేశామని సీఎం పేర్కొన్నారు. ఇందులో ఎస్సీలు-17.43 శాతం, ఎస్టీలు-10.45 శాతం, బీసీలు- 46.25శాతం, ముస్లిం మైనార్టీల్లో బీసీలు- 10.08 శాతం, ముస్లిం మైనార్టీలు కలుపుకుని బీసీలు- 56 శాతం, రాష్ట్రంలో ముస్లింలతో సహా మొత్తం ఓసీలు- 15.79 శాతం ఉన్నట్లు సీఎం రేవంత్ తెలిపారు.

**హైదరాబాద్, ఫిబ్రవరి 4 :** బిసి కులగణన సర్వేపై తెలంగాణ అసెంబ్లీలో వాడీ వేడి చర్చ జరిగింది. ప్రతిపక్ష ఎమ్మెల్యేలు చేసిన ఆరోపణలను సీఎం రేవంత్‌రెడ్డి తిప్పికొట్టారు. భారాస నేతలు సర్వేలో ఎందుకు పాల్గొనలేదని నిలదీశారు. ఇలా పాల్గొనని నేతలకు సభలో మాట్లాడే అర్హత లేదన్నారు. వారికి మైక్ ఇవ్వొద్దని స్పీకర్‌ను కోరారు. 'కులగణన సర్వే 50 రోజులు జరిగితే .. మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రులు కేటీఆర్,

మిగతా 2 లో

మధ్యతరగతి ప్రజల

# ఆకాంక్షలను నెరవేరుస్తాం



- "ప్రజల సొమ్ము ప్రజల చేతికే" అనేది మా నినాదం
- ఢిల్లీ నుంచి రూపాయి పంపితే.. గ్రామాలకు 16పైసలే చేరుతోంది
- పదేళ్లుగా కేంద్ర ప్రభుత్వంపై అవినీతి ఆరోపణలే లేవు.
- ప్రపంచ గేమింగ్ రాజధానిగా భారత్ తయారవుతోంది.

**ఢిల్లీ, ఫిబ్రవరి 4 :** గత పదేళ్లలో 25 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడేశామని ప్రధాని మోదీ తెలిపారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ సందర్భంగా మోదీ ప్రసంగించారు. "రాష్ట్రపతి ప్రసంగం మాలో ఆత్మవిశ్వాసం నింపిం. మరోసారి మా ప్రభుత్వాన్ని ఎన్నుకున్న ప్రజలకు కృతజ్ఞతలు. వికసిత్ భారత్ సాధనే మా ప్రభుత్వ లక్ష్యం. మధ్యతరగతి ప్రజల ఆకాంక్షలను

మిగతా 2 లో

కులగణన సర్వేల లెక్కల్లో

# పొంతన లేదు





- జనాభాను తక్కువ చేసి చూపారన్న విపక్షాలు
- సర్వే తీర్మానంతో సరిపోదన్న బీఆర్ఎస్, బీజేపి

సమగ్రత లేదన్న శ్రీనివాస్ యాదవ్, పాయల్ శంకర్

2 లో

## సమగ్ర చర్చ జరగాలి

- మండలిలో బిఆర్ఎస్ నేతలు డిమాండ్
- మండలి నిరవధికంగా వాయిదా

03



తెలంగాణ శాసనమండలి నిరవధికంగా వాయిదా పడింది. శనివారం ఉదయం 11 గంటలకు ప్రారంభమైన అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా కులగణన నివేదిక, స్థానిక ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల పెంపు వంటి అంశాలపై చర్చించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీల నిలదీతల నడుమ శాసనమండలిని నిరవధికంగా వాయిదా వేశారు.



## యధాతథంగా పాతపన్ను

- రద్దు చేసే ఆలోచన లేదన్ననిర్మలా సీతారామన్

03



నేడు ప్రయాగ్‌రాజ్‌కు

## ప్రధాని

- త్రివేణి సంగమంలో స్నానం ఆచరించనున్న మోడీ

ప్రధాని నరేంద్ర మోదీ నేడు మహా కుంభమేళాకు వెళ్లనున్నారు. ప్రయాగ్ రాజ్ లో జరుగుతున్న కుంభమేళాలో ఆయన పుణ్యస్నానాలు చేయనున్నారు. మోదీ రాక సందర్భంగా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రధాని పర్యటన కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. మోదీ నేడు మహా కుంభమేళాకు వచ్చిఅక్కడ పుణ్యస్నానాలు ఆచరించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.

## కుంభమేళా మృతుల సంఖ్యను దాస్తున్నారు

లోక్‌సభలో అఖిలేశ్ యాదవ్ విమర్శలు

దాయాల్సిన అవసరం లేదన్న ఎంపి హేమమాలిని

02



ఉద్యమ కెరటం
www.udyamakeratam.com
తెలుగు దినపత్రిక
UDYAMA KERATAM TELUGU DAILY



# ఫిరాయింపుదారులకు షాక్

**హైదరాబాద్, ఫిబ్రవరి 4:** పార్టీ మారిన ఎమ్మెల్యేకు షాక్ తగిలింది. సుప్రీంకోర్టు ఆదేశాలతో పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలకు నోటీసులు జారీ అయ్యాయి. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన 10 మంది ఎమ్మెల్యేలకు అసెంబ్లీ కార్యదర్శి నోటీసులు జారీ చేశారు. పార్టీ ఫిరాయింపులపై లిఖిత పూర్వక సమాధానం చెప్పాలని నోటీసుల్లో పేర్కొన్నారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని సుప్రీంకోర్టును బీఆర్ఎస్ ఆశ్రయించిన విషయం తెలిసిందే. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై నాలుగు నెలల్లో చర్యలు తీసుకోవాలని గతంలోనే తెలంగాణ హైకోర్టు ఆదేశించింది. అయినప్పటికీ ఎలాంటి పురోగతి లేకపోవడంతో బీఆర్ఎస్ పార్టీ సుప్రీం కోర్టును ఆశ్రయించింది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ నుంచి గెలిచిన పది మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరిపై అనర్హత వేటు వేయాలంటూ ఇప్పటికే బీఆర్ఎస్ పార్టీ హైకోర్టులో పిటిషన్ వేసింది. ఎమ్మెల్యేలపై నాలుగు నెలల్లో చర్యలు తీసుకోవాలని హైకోర్టు ఆదేశించినప్పటికీ ఈ వ్యవహారం ముందుకు జరగలేదు. దీంతో బీఆర్ఎస్ పార్టీ సుప్రీంలో పిటిషన్ వేసింది. మొదట తెల్లం వెంకట్రావు, కడియం శ్రీహరి, దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేయాలని బీఆర్ఎస్ పిటిషన్ వేసింది. ఆ తరువాత మరొక ఏడుగురు ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని సుప్రీంకోర్టును ఆశ్రయించింది బీఆర్ఎస్. అయితే వీటన్నింటినీ కలిపి ఒకేసారి విచారణ చేస్తామంటూ.. ఈ కేసు విచారణను సుప్రీం కోర్టు ఈనెల 10కి వాయిదా వేసింది. ఓ వైపు కోర్టులో విచారణ జరుగుతుండగానే.. పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని స్పీకర్‌ను కూడా కోరింది బీఆర్ఎస్. దీనిపై స్పందించిన స్పీకర్.. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలకు నోటీసులు ఇచ్చారు. లిఖితపూర్వకంగా సమాధానాలు చెప్పాలంటూ నోటీసుల్లో పేర్కొన్నారు.

# 1.55 కోట్ల మంది ఉపాధిహామీ కార్మికుల తొలగింపు

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4:** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో ఉన్న వారిలో 2022-24 మధ్యకాలంలో 1.55 కోట్ల మంది కార్మికుల పేర్లను తొలగించినట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. కేంద్ర గ్రామీణాభివృద్ధి సహాయమంత్రి కమలేశ్ పాసవాన్ లోక్‌సభలో ఈ విషయాన్ని వెల్లడించారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో 86,17,887 మంది, 2023-24లో 68,86,532 మంది కార్మికుల పేర్లను తొలగించినట్లు కేంద్ర మంత్రి పేర్కొన్నారు. రెండేళ్లలో మొత్తంగా 1,55,04,419 మంది కార్మికుల పేర్లను తొలగించామన్నారు. నకిలీ, తప్పుడు జాబ్ కార్డులు, గ్రామాల నుంచి కార్మికుల కుటుంబాలు తరలిపోవడం లేదా సంబంధిత గ్రామాలను పట్టణాలుగా వర్గీకరించడం తదితర అంశాలు ఇందుకు కారణంగా చెప్పారు.

# టీజీపీఎస్సీ గ్రూప్ 1 మెయిన్స్ ఫలితాలకు మార్గం సుగమం

**హైదరాబాద్,ఫిబ్రవరి 4:** తెలంగాణ రాష్ట్రంలో టీజీపీఎస్సీ గ్రూప్ 1 మెయిన్స్ ఫలితాలకు మార్గం సుగమమైంది. ఈ ఫలితాల విడుదలకు అడ్డుగా ఉన్న రెండు కేసులను సుప్రీంకోర్టు కొట్టేసింది. దీంతో వచ్చే 10, 12 రోజుల్లోనే గ్రూప్ 1 మెయిన్స్ ఫలితాలను విడుదలకానున్నాయి. ఈ మేరకు టీజీపీఎస్సీ కసరత్తు చేస్తుంది. జీవో 29ను సవాలు చేయడంతోపాటు వికలాంగుల రిజర్వేషన్ అంశాలపై పలువురు గ్రూప్ 1 అభ్యర్థులు సుప్రీంకోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే. దానిపై టీజీపీఎస్సీ కేవియట్ పిటిషన్ దాఖలు చేయగా.. ఇటీవల అత్యున్న ధర్మాసనం విచారణ జరిపి అభ్యర్థుల పిటిషన్లను కొట్టివేసింది. దీంతో గ్రూప్ 1 ఫలితాల విడుదలకు అన్ని అడ్డంకులు తొలగినట్లైంది. తెలంగాణ రాష్ట్రంలోని విద్యా సంస్థల్లో 2025-26 విద్యా సంవత్సరానికి గానూ ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే టీజీ ఐసెట్ 2025 నోటిఫికేషన్ మార్చి 6న విడుదల కానుంది. ఈ మేరకు ఉన్నత విద్యా మండలి వెల్లడించింది. నోటిఫికేషన్ విడుదల తర్వాత మార్చి 10 నుంచి దరఖాస్తులు స్వీకరన చేపడతారు. టీజీ ఐసెట్ సెట్ కమిటీ సమావేశాన్ని సోమవారం మాసాబ్‌ట్యాంక్‌లోని ఉన్నత విద్యామండలి కార్యాలయంలో నిర్వహించగా.. ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. ఐసెట్‌కు మే 3 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఇక ఐసెట్ పరీక్షలు జూన్ 8, 9 తేదీల్లో ఆన్‌లైన్‌లో జరగనున్నాయి. 2025-26 విద్యా సంవత్సరానికి ఎంఈ, ఎంటెక్, ఎం ఫార్మసీ వంటి పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే టీఎస్ పీజీఈసెట్ నోటిఫికేషన్ మార్చి 12న విడుదల చేసేందుకు విద్యాశాఖ ఏర్పాట్లు చేస్తుంది. మార్చి 17నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు ప్రారంభం అవుతాయి. సోమవారం కూకట్‌పల్లిలోని జేఎన్టీయూలో నిర్వహించిన సెట్ కమిటీ సమావేశంలో ఈ మేరకు షెడ్యూల్‌ను ఖరారు చేశారు. ఈ సందర్భంగా పీజీఈసెట్ కన్వీనర్ ప్రొఫెసర్ ఏ అరుణకుమారి, కో కన్వీనర్ ప్రొఫెసర్ బీ రవీంద్రారెడ్డి పీజీఈసెట్ షెడ్యూల్‌ను విడుదల చేశారు.

# నేడు ప్రయాగ్‌రాజ్‌కు ప్రధాని

## త్రివేణి సంగమంలో స్నానం ఆచరించనున్న మోడీ

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి4 :** ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న అతిపెద్ద ఆధ్యాత్మిక వేడుక మహా కుంభమేళాలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ బుధవారం పాల్గొనన్నారు. ఆయన త్రివేణీ సంగమంలో పుణ్యస్నానం ఆచరించనున్నట్లు సమాచారం. ఈమేరకు ప్రధాని షెడ్యూల్‌ను ఓ సీనియర్ ఐపీఎస్ అధికారి చెప్పినట్లు ఆంగ్ల మీడియా కథనాలు వెల్లడించాయి. 'బుధవారం ఉదయం 10 గంటలకు ప్రధాని ప్రయాగ్‌రాజ్ ఎయిర్‌పోర్ట్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి ఉదయం 10.45 గంటలకు అరైల్ ఘాట్‌కు వెళ్తారు. ఘాట్ నుంచి బోటులో ప్రయాణించి మహాకుంభమేళా జరుగుతున్న ప్రాంతానికి చేరుకుంటారు. ఉదయం 11 నుంచి 11.30 గంటల మధ్య త్రివేణీ సంగమంలో ప్రధాని పుణ్యస్నానం ఆచరిస్తారు. 11.45 గంటలకు బోటులో తిరిగి అరైల్ ఘాట్‌కు వెళ్తారు. అక్కడి నుంచి ప్రయాగ్‌రాజ్ ఎయిర్‌పోర్టుకు వెళ్లి దిల్లీ బయల్దేరుతారు. ఈ పర్యటనలో భాగంగా ప్రధాని ఎలాంటి కార్యక్రమాల్లో పాల్గొనబోరని తెలుస్తోంది. కేవలం పుణ్యస్నానం ఆచరించి గంగానదికి పూజలు చేయనున్నారని సమాచారం. దాదాపు గంటన్నర పాటు మోదీ ప్రయాగ్‌రాజ్‌లో ఉండనున్నారు. ఈ క్రమంలోనే నగరంతో పాటు కుంభమేళా వద్ద ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేసినట్లు సమాచారం. ప్రధాని వెంట యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ పాల్గొంటారు. మహా కుంభమేళా ప్రారంభానికి ముందు ప్రధాని మోదీ ప్రయాగ్‌రాజ్ వెళ్లిన సంగతి తెలిసిందే. రూ.5500 కోట్లతో పలు అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. 144 ఏళ్లకోసారి వచ్చే జనవరి 13న కుంభమేళా ప్రారంభం కాగా.. ఫిబ్రవరి 26వ తేదీ వరకు కొనసాగనుంది. ఇప్పటికే దాదాపు 35 కోట్లకు పైగా భక్తులు కుంభమేళాకు వెళ్లి పుణ్యస్నానాలు ఆచరించారు.

# మధ్యతరగతి ప్రజల ఆకాంక్షలను నెరవేరుస్తాం


మొదటి పేజీ తరువాయి



నెరవేరుస్తాం. గత ప్రభుత్వాలు గరీబీ హఠావో అని నినాదాలు మాత్రమే చేశాయి. కొందరు నేతలు బంగ్లాలు కట్టుకోవడంపై దృష్టిసారించారు. మేం మాత్రం ప్రతి ఇంటికీ నల్లా నీరు ఇవ్వడంపై దృష్టి పెట్టాం. దేశంలో పేదల కోసం 12 కోట్లకుపైగా మరుగుదొడ్లు కట్టించాం. "కొందరు నేతలు పేదల గుడిసెల వద్ద వారితో ఫొటోలు గేందుకే ఉత్సాహం చూపిస్తారు. సభలో పేదల గురించి మాట్లాడితే.. ఫొటోలకు ఫోజులిచ్చిన నేతలు మొహం విసుగ్గా పెడతారు. దిల్లీ నుంచి రూపాయి పంపితే.. గ్రామాలకు 16పైసలే చేరుతోందని గతంలో ఓ ప్రధాని వాపోయారు.

# బీసీల లబ్ధియే లక్ష్యం

మొదటి పేజీ తరువాయి



హరీశ్‌రావు, ఎమ్మెల్యేలు పద్మారావు, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, మహబూబ్‌నగర్ భాజపా ఎంపీ డీకే అరుణ సర్వేలో పాల్గొనలేదు. సర్వేలో భూమి వివరాలు చెప్పాలని ఫామ్‌లో ఒక కాలమ్ ఉంటే.. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు ఎవరూ సమాచారం ఇవ్వలేదు. 3.54 కోట్ల మంది సర్వేలో పాల్గొంటే.. ఎమ్మెల్యేలు, ఎంపీలు అందరూ భూముల వివరాలు ఇచ్చారు. కానీ, భూముల వివరాలు అడగ్గానే కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు భయపడి సర్వేలో పాల్గొనలేదు' అని అన్నారు. గత ప్రభుత్వం సమగ్రసర్వే నివేదికను ఎందుకు బయటపెట్టలేదోచెప్పాలన్నారు. దానిని పబ్లిక్డొమైన్‌లో ఎందుకు పెట్టలేదన్నారు. ఆనాడు అధికారికంగా అసెంబ్లో ఎందుకు పెట్టలేదని బిఆర్ఎస్‌ను నిలదీసారు. ఇదే సందర్భంలో రిజర్వేషన్లకు రాజ్యాంగ సవరణ అవసరం కనుక అసెంబ్లీలో తీర్మానం చేసినా లాభం లేదన్నారు. అందుకే పార్టీ పరంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ పక్షాన బీసీలకు 42శాతం సీట్లు ఇస్తాం అని ప్రకటించారు. అన్ని పార్టీలు దీనికి కట్టుబడి ఉంటాయా అని ప్రశ్నించారు. రాజకీయాల్లో బీసీలకు మేం 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తాం. ఈ మేరకు పీసీసీ అధ్యక్షుడి నుంచి మాట తీసుకున్నా. అన్ని పార్టీలు బీసీలకు 42శాతం సీట్లు ఇవ్వాలి. కులగణన సర్వే డేటాను సంక్షేమ పథకాల విధానాల తయారీకి వాడతాం. 1931 నుంచి ప్రతి పదేళ్లకు ఓసారి జనగణన చేపట్టారు. 2014లో నరేంద్రమోదీ ప్రధాని అయిన తర్వాత ఇప్పటివరకు జనగణన జరగలేదు. 2021 నుంచి ఇప్పటి వరకు సర్వే చేయకుండా వదిలేశారు. దీనిపై బిజెపి నేతలు ప్రధాని మోడీపై ఎందుకు ఒత్తిడి చేయడం లేదన్నారు. బలహీనవర్గాలకు వారి హక్కులు ఇవ్వడం భాజపాకు ఇష్టం లేదు. ప్రధాని మోదీ .. బలహీనవర్గాలకు ఏదైనా సాయం చేయాలనుకుంటే 2021లో లెక్కించాల్సిన జనాభాను ఇంతవరకు ఎందుకు చేయలేదని రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. సామాజిక, ఆర్థిక, ఉపాధి, విద్య, రాజకీయ, కులగణన సర్వే నివేదికను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా నివేదికలోని అంశాలను సీఎం వివరించారు. 'రాష్ట్రంలో సమగ్ర ఇంటింటి కులగణన సర్వే చేయాలని ఫిబ్రవరి 2024లో నిర్ణయం తీసుకున్నాం. కర్ణాటక, బిహార్ సహా వివిధ రాష్ట్రాల్లో జరిగిన సర్వేలను క్షుణ్ణంగా అధ్యయనం చేశాం. సర్వే నిర్వహించే విధానాలపై వివిధ సంఘాలు, మేధావుల అభిప్రాయాలు తీసుకున్నాం. దాదాపు 50 రోజుల పాటు సర్వే జరిగింది. గ్రామాల్లో 66.39 లక్షల కుటుంబాలు, పట్టణాల్లో 45.15 లక్షల కుటుంబాల్లో సర్వే నిర్వహించాం. రాష్ట్రంలో మొత్తంగా 1.12 కోట్ల కుటుంబాల వివరాలు సర్వే చేశాం. సర్వే ప్రకారం ఎస్సీలు 61,84,319 (17.43 శాతం), బీసీలు (ముస్లిం మైనారిటీ మినహా) 1,64,09,179 (46.25 శాతం), ఎస్టీలు 37,05,929 (10.45 శాతం), ముస్లిం మైనారిటీలు 44,57,012 (12.56 శాతం) మంది ఉన్నారు. ఈ నివేదికను సంక్షేమ విధానాల తయారీకి వినియోగిస్తాం.జనగణన కంటే పకడ్బందీగా కులగణన చేశాం. రాష్ట్రంలో ఉన్న ప్రతి ఇంటికీ స్టిక్కర్ అంటించాం. ఒక ఎన్యుమరేటర్ రోజుకు 10 ఇళ్లకంటే ఎక్కువ ఇళ్లలో సర్వే చేయలేదు. 8 పేజీలతో ఉన్న ప్రశ్నపత్రంలో సమగ్ర వివరాలు నమోదు చేశాం. 76 వేల మంది డేటా ఎంట్రీ ఆపరేటర్లు 36 రోజుల పాటు పనిచేసి డేటా క్రోడీకరించారు. మొత్తంగా రూ. 125 కోట్లు ఖర్చు చేసి సర్వే ద్వారా సమగ్ర వివరాలు సేకరించాం. మేం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే సర్వే చేయించాం' అని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. సర్వే ఆధారంగా ఆయా కులాల వారికి న్యాయం చేస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఈ సర్వే దేశానికే దిక్సూచిగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు. 'భవిష్యత్‌లో చేపట్టబోయే కార్యక్రమాలకు ఈ సర్వే రోడ్‌మ్యాప్‌లా పనిచేస్తుంది. భావితరాలకు న్యాయం చేయడానికి సమగ్రంగా వివరాలు సేకరించాం. బలహీనవర్గాలకు న్యాయం చేయాలనే చిత్తశుద్ధి ఈ ప్రభుత్వానికి ఉంది. బీసీలకు న్యాయం చేసేందుకు చేపట్టాల్సిన పథకాలపై విపక్షాలు సూచనలు చేయాలి' అని మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు. అంతకుముందు సమగ్ర కులగణన, ఎస్సీ వర్గీకరణ నివేదికలకు తెలంగాణ మంత్రివర్గం ఆమోదం తెలిపింది. సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన అసెంబ్లీ హాల్లో సుమారు 2 గంటలపాటు క్యాబినెట్ భేటీ కొనసాగింది. ఈ నివేదికలను మధ్యాహ్నం 2 గంటలకు అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. క్యాబినెట్ భేటీలో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ 'దేశంలో మొదటిసారి కులగణన చేసి చరిత్ర సృష్టించాం. పకడ్బందీగా సర్వేచేసి సమాచారం సేకరించాం. కులగణన, ఎస్సీ వర్గీకరణకు రోడ్ మ్యాప్ తెలంగాణ నుంచి ఇస్తున్నాం. కులగణన విషయంలో ప్రధానిపైనా ఒత్తిడి పెరుగుతుంది. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పుతో పాటు మంత్రివర్గ ఉప సంఘం, ఏకసభ్య కమిషన్ సిఫార్సుల ప్రకారం ముందుకెళ్తాం. ప్రతిపక్ష నేత సభకు రావాలి కదా! ప్రధాన ప్రతిపక్షానికి బాధ్యత, చిత్తశుద్ధి లేదని వ్యాఖ్యానించారు.

# ఏటా గుర్తు పెట్టుకోవాలి

**హైదరాబాద్, ఫిబ్రవరి 4:** బడుగు బలహీన వర్గాలు, దళితులు, మైనార్టీ వర్గాల్లో దశాబ్దాల కాలంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలకు తెలంగాణ మంత్రివర్గం, శాసనసభ శాశ్వత పరిష్కారం చూపించడంలో ప్రాముఖ్యత కలిగిన ఫిబ్రవరి 4న గుర్తు చేసుకోవడానికి ప్రతి ఏటా ఆ రోజున "సామాజిక న్యాయ దినోత్సవం"గా జరుపుకోవాలని ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి నిర్ణయించారు. సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి, రాజకీయ, కుల గణన (సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే 2024), షెడ్యూల్డ్ కులాల ప్రత్యేక వర్గాల ఉప వర్గీకరణపై జస్టిస్ షమీమ్ అక్తర్ నేతృత్వంలోని ఏకసభ్య కమిషన్ ఇచ్చిన నివేదికలకు శాసనసభ ఆమోదించిన నేపథ్యంలో ముఖ్యమంత్రి కీలక ప్రకటన చేశారు. తెలంగాణ చరిత్రలో ఫిబ్రవరి 4 వ తేదీకి అత్యంత ప్రాధాన్యత ఉంది. సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే చేపట్టాలని 4 ఫిబ్రవరి 2024 రోజున మంత్రివర్గంలో ఆమోదించుకున్న తర్వాత, సర్వే నివేదికను ఫిబ్రవరి 4 వ తేదీన తిరిగి మంత్రివర్గం ఆమోదించుకోవడం, అలాగే ఇదే రోజున ఎస్సీ ఉపకులాల్లో కీలకమైన ఏ, బీ, సీ కేటగిరీలుగా వర్గీకరణ చేసుకున్న నేపథ్యంలో ఫిబ్రవరి 4 వ తేదీకి ఉన్న ప్రాధాన్యతను గుర్తుచేసుకోవడానికి సామాజిక న్యాయ దినంగా నిర్వహించుకోవాలని చెప్పారు. బడుగు బలహీన, దళిత, మైనారిటీ వర్గాలకు దశాబ్దాల కాలం అపరిష్కృతంగా ఉన్న సమస్యకు మంత్రిమండలితో పాటు శాసనసభ శాశ్వత పరిష్కారం చూపించిన శుభదినం అయినందున ఫిబ్రవరి 4 న సామాజిక న్యాయ దినంగా పాటిస్తూ అందరం అందులో పాల్గొనాలన్నారు. ఈ రెండు అంశాలు కార్యాచరణలోకి రావడంలో మంత్రివర్గ సహచరులు, మంత్రివర్గ ఉపసంఘం, ఉన్నతాధికారులు ఎంతో శ్రమించి కట్టుదిట్టమైన ప్రణాళికతో వాటికి ఒక చట్టబద్ధత కల్పించే కార్యక్రమాన్ని తీసుకొచ్చినందుకు వారందరికీ అభినందనలు తెలిపారు. సభలో ఈ అంశాలపై స్పీకర్ తో పాటు చర్చలో పాల్గొన్న మంత్రివర్గ సహచరులతో పాటు ప్రతిపక్ష, అధికార సభ్యులకు ధన్యవాదాలు. సభ్యులందరూ విజ్ఞతను ప్రదర్శించి ఈ సమస్యలకు శాశ్వతంగా పరిష్కారం చూపించారు. ఎస్సీ ఉప కులాల వర్గీకరణపై రాష్ట్ర ప్రభుత్వం జీవోలు ఇవ్వడమే కాకుండా దీనికి చట్టంగా రూపకల్పన చేయాలనుకుంటున్నామని, భవిష్యత్తులో ఎవరూ దీన్ని మళ్లీ ప్రశ్నించకుండా అమలు చేసే క్రమంలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఉండాలంటే చట్టబద్ధత కల్పించాలన్నారు. తొందరలోనే జీవోల రూపంలో చట్టం రూపంలో తీసుకొచ్చి ఇది సంపూర్ణంగా అమలు చేసి ఈ సమస్యకు శాశ్వత పరిష్కారాన్ని చూపించాలని అనుకుంటున్నామన్నారు. ఈ సమస్య పరిష్కారానికి జరిగిన పోరాటంలో చాలా మంది ప్రాణాలు కోల్పోయారని, వారందరికీ నివాళులు అర్పిస్తున్నామన్నారు. వారి త్యాగం వృథా పోదని, వారు ఏ లక్ష్యం కోసమైతే కొట్లాడారో అది నెరవేర్చే విధానాన్ని అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ ప్రభుత్వం కచ్చితంగా ప్రజల అభిప్రాయాలకు తొలి ప్రాధాన్యత ఇస్తుందని, రాష్ట్రంలో అమలు చేయడమే కాకుండా దేశంలో జనాభా లెక్కలు సమయంలో అందులో కుల గణన అంశాన్ని చేర్చాలని కేంద్ర ప్రభుత్వంపైన ఒత్తిడి తెస్తామన్నారు. ఈ విషయంలో తెలంగాణ ప్రభుత్వం ఆదర్శంగా నిలుస్తుందన్నారు. బలహీన వర్గాలకు సంబంధించిన కులగణన విషయంలోనే కాకుండా ఇతర రాష్ట్రాల్లో మాల మాదిగ ఉపకులాల వర్గీకరణ అమలు చేయడానికి అవసరమైన సహకారాన్ని అందిస్తామని చెప్పారు.

# కులగణన సర్వేకు అసెంబ్లీ ఆమోదం


## దేశవ్యాప్తంగా సర్వే చేయాలని కోరుతూ తీర్మానం



**హైదరాబాద్, ఫిబ్రవరి 4 :** తెలంగాణలో సామాజిక,ఆర్థిక కులగణన సర్వేకు తెలంగాణ అసెంబ్లీ ఆమోదం తెలిపింది. దేశ వ్యాప్తంగా కులగణన చేయాలని కేంద్రాన్ని కోరుతూ తీర్మానం చేసింది. రేవంత్ తీర్మానానికి అసెంబ్లీ ఆమోదం తెలిపింది. కులగణనపై తీర్మానం సందర్భంగా అసెంబ్లీలో బీఆర్ఎస్, బీజేపీ సభ్యులు తీవ్ర విమర్శలు చేశారు. కాంగ్రెస్ ధీటుగా కౌంటర్ ఇచ్చాయి. సీఎం రేవంత్ రెడ్డి వర్సెస్ మాజీ మంత్రి కేటీఆర్ మధ్య మాటల యుద్ధం జరిగింది. కులగణన లెక్కలో బీసీల సంఖ్యను తక్కువ చేసి చూపించారని కేటీఆర్ అన్నారు. 2014లో సమగ్ర సర్వే వివరాలు వెబ్ సైట్లో పెట్టామని చెప్పారు . వెబ్ సైట్లో ఉన్న రిపోర్ట్.. ఆరోజు చేసిన సమగ్ర కుటుంబ సర్వేనే అని అన్నారు. సమగ్ర కుటుంబ సర్వే ప్రకారం బీసీల సంఖ్య 51 శాతం. ముస్లీం బీసీలు 10 శాతం కలిపితే ఆనాటి మొత్తం బీసీలు 61 శాతం. 5 శాతం బీసీలను తగ్గించారు. మీ ప్రభుత్వం మీద నమ్మకం లేదు. ప్రత్యేక మైన బిల్లు తీసుకొస్తారని మేము ఆశించాం. కుటుంబ సర్వేచేసినప్పుడు రేవంత్ పాల్గొన్నారా?. 56 శాత ఉన్న బీసీలకు సబ్ ప్లాన్ తెస్తారని ఆశించాం అని కేటీఆర్ అన్నారు. కేటీఆర్ వ్యాఖ్యలకు సీఎం రేవంత్ రెడ్డి కౌంటర్ ఇచ్చారు. సమగ్ర కుటుంబ సర్వేను లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్ కోసం చేశారని ఫైర్ అయ్యారు. ఆనాడు సర్వేను ఊరు పేరు తెలియన వాళ్లతో చేయించారు. సర్వే రిపోర్ట్ పై ఎందుకు ఆనాడు కేబినెట్ లో చర్చించలేదు.. అసెంబ్లీలో పెట్టలేదు. అర్థం పర్థం లేని మాటలతో ప్రయోజనం లేదు. కులగణన సర్వేలో పాల్గొనలేని కేటీఆర్ కు మాట్లాడే హక్కు లేదు. వాళ్లకు మైక్ ఇవ్వొద్దు..సభలో మాట్లాడే అర్హత లేదు. వీళ్లు చూపిస్తున్న రిపోర్ట్ ప్రభుత్వ వెబ్ సైట్ లో లేదు. ఆనాడు సర్వే చేసిన ఎనామ్యలేటర్లు ఎవరు?. ఒక్కరోజులోనే రాష్ట్ర మొత్తాన్ని లెక్కించారా?. సమగ్ర సర్వేను వాళ్ల రాజకీయం కోసం వాడుకుంటున్నారు. లేని పోని విమర్శలతో ఉపయోగం లేదని రేవంత్ రెడ్డి ఘాటుగా సమాధానం ఇచ్చారు.

# చైనా దురాక్రమణలో భారత్ భూభాగాలు

## రాహుల్ వ్యాఖ్యలపై మండిపడ్డ రాజ్‌నాథ్ సింగ్




**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4 :** సరిహద్దులో చైనా దురాక్రమణ అంటూ..లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలపై కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్ మండిపడ్డారు. భారత్- చైనా సరిహద్దు పరిస్థితి గురించి ఆర్మీ చీఫ్ చేసిన ప్రకటనపై రాహుల్ వ్యాఖ్యలు చేయడంపై ధ్వజమెత్తారు. కాంగ్రెస్ నేత తప్పుడు ఆరోపణలు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. భారత్-చైనా సరిహద్దు పరిస్థితి గురించి ఆర్మీ చీఫ్ చేసిన ప్రకటనపై రాహుల్ గాంధీ పార్లమెంటు ప్రసంగంలో తప్పుడు ఆరోపణలు చేశారంటూ రాజ్‌నాథ్ సింగ్ మండిపడ్డారు. ఆర్మీ చీఫ్ వ్యాఖ్యలను తప్పుగా ప్రచారం చేస్తున్నారు. జాతీయ ప్రయోజనాలకు సంబంధించిన అంశాలపై ఆయన బాధ్యతారహిత రాజకీయాలకు పాల్పడడం విచారకరం. ఆయన చరిత్రపై అవగాహన పెంచుకోవాలని అంటూ 'ఎక్స్' వేదికగా విమర్శించారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంలో రాహుల్ గాంధీ.. భారత్ భూభాగాలు, మేకిన్ ఇండియా గురించి ప్రస్తావించారు. 'చైనా బలగాలు మన భూభాగంలో ఉన్నాయనే విషయాన్ని ప్రధాని మోదీ ఖండించారు. దీనిపై ఆర్మీ చీఫ్ వాస్తవం మాట్లాడారు. చైనా బలగాలు మన భూభాగంలో ఉన్నాయని ఆయన అన్నారు' అని రాహుల్ అన్నారు. అదే విధంగా తయారీ రంగంలో భారత్ కంటే చైనా పదేళ్లు ముందుందన్నారు. ఆ దేశానికి చెందిన మోటార్లు, బ్యాటరీలు, ఆప్టిక్స్‌ల దిగుమతులపై ఇప్పటికీ భారత్ ఆధారపడటాన్ని ఆయన తప్పుబట్టారు. ప్రధాని మోదీచేపట్టిన 'మేకిన్ ఇండియా' విఫలం కావడం వల్లే బీజింగ్ నుంచి వస్తువులు దేశంలోకి వస్తున్నాయని ఆయన ఆరోపించారు.

# కుంభమేళా మృతుల సంఖ్యను దాస్తున్నారు

## లోక్‌సభలో అఖిలేశ్ యాదవ్ విమర్శలు

## దాయాల్సిన అవసరం లేదనన్న ఎంపి హేమమాలిని



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4:** అతిపెద్ద ఆధ్యాత్మిక వేడుక మహా కుంభమేళాలో ఇటీవల తొక్కిసలాట ఘటనలో మృతి చెందిన వారి సంఖ్యను ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం దాచిపెడుతోందని సమాజ్‌వాది పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ ఆరోపించారు. మంగళవారం పార్లమెంటులో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. 'ప్రభుత్వం నిరంతరం బడ్జెట్ గణాంకాలు ఇస్తూనే ఉంది. అదేవిధంగా.. మహాకుంభమేళా లో మరణించిన వారి గణాంకాలు సైతం ఇవ్వాలి. అక్కడి ఏర్పాట్లపై స్పష్టత ఇవ్వడానికి అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలి. కుంభమేళా నిర్వహణ బాధ్యతలు ఆర్మీకి అప్పగించాలని డిమాండ్ చేస్తున్నానని అన్నారు. మృతుల సంఖ్య, క్షతగాత్రులకు అందించిన వైద్యం, మందులు, ఆహారం, రవాణా వంటి అన్ని వివరాలను పార్లమెంటులో సమర్పించాలి. ఘటనకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు నిజాన్ని దాచిన వారిని శిక్షించాలని డబుల్ ఇంజిన్ ప్రభుత్వాన్ని కోరుతున్నాం అన్నారు. నేరం లేకుంటే ఆ గణాంకాలను ఎందుకు దాచారని అఖిలేశ్ యాదవ్ ప్రశ్నించారు. అఖిలేశ్ యాదవ్ చేసిన ఆరోపణలపై మంగళవారం భాజపా ఎంపీ హేమమాలిని స్పందించారు. ఆ ఘటనను పెద్దదిగా చేసి చూపుతున్నారని అన్నారు. సమాజ్‌వాదీ పార్టీ ఆరోపణలను తోసిపుచ్చారు.'అసత్యాలు మాట్లాడటమే అఖిలేశ్ యాదవ్ పని. మేం కూడా కుంభమేళాను సందర్శించాం. కుంభమేళాకు ఎంతోమంది వస్తున్నారు. అంతమంది వస్తున్నప్పుడు నిర్వహణ కష్టమైనప్పటికీ.. యూపీ ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చాలా బాగా నిర్వహిస్తోందని అన్నారు.

ఉద్యమ కెరటం
www.udyamakeratam.com
నిజం.. రక్షణ దక్షత
తెలుగు దినపత్రిక
UDYAMA KERATAM TELUGU DAILY



# సర్వేల లెక్కల్లో పొంతన లేదు

- జనాభాను తక్కువ చేసి చూపారన్న విపక్షాలు
- సర్వే తీర్మానంతో సరిపోదన్న బీఆర్ఎస్, బీజెపి
- సమగ్రత లేదన్న శ్రీనివాస్ యాదవ్, పాయల్ శంకర్





**హైదరాబాద్,ఫిబ్రవరి4 :** రేవంత్ రెడ్డి కులగణన సర్వే నివేదికలో పొందుపర్చిన అంశాలపై భాజపా ఎమ్మెల్యే పాయల్ శంకర్, భారాస ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ పలు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. కులగణన సర్వేపై కొన్ని అనుమానాలు వ్యక్తం అవుతున్నాయని భారాస నేత, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. 'గత 15 ఏళ్లలో బీసీ జనాభా అంతగా పెరగలేదని, ఎస్సీ, ముస్లింల జనాభా తగ్గినట్లు సర్వే నివేదిక చెబుతోంది. జీహెచ్ఎంసీలో 30 శాతం కూడా సర్వేలో పాల్గొనలేదు. అంతేకాకుండా చాలామంది వివరాలు చెప్పలేదు. కేవలం సర్వే చేయించి, తీర్మానం చేస్తే సరిపోదు. ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలకు చట్టబద్ధత కల్పించాలి. ఏ కులం జనాభా ఎంతో ప్రభుత్వం వెల్లడించాలి. సర్వేలో 56 అంశాలు ప్రస్తావించారు. అందుకే చాలా మంది వివరాలు చెప్పలేదు. ఫార్మాట్ మార్చి మరోసారి సర్వే చేయించాలి. సర్వే నివేదిక ఆధారంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్ కల్పించాలని తలసాని కోరారు. ఎన్నికల సమయంలో మాత్రమే రాజకీయ పార్టీలకు బీసీలు గుర్తుకు వస్తున్నారని భాజపా ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. ఓట్లు పొందేందుకే బీసీ నినాదం అందుకుంటున్నారని ఆరోపించారు. ప్రభుత్వం చెబుతున్న లెక్కలు, రాష్ట్ర జనాభా సంఖ్యకు పొంతన లేదన్నారు. 'ప్రభుత్వ లెక్కల ప్రకారం రాష్ట్ర జనాభా 4.33 కోట్లు అని తెలుస్తోంది. కులగణన సర్వే ప్రకారం రాష్ట్ర జనాభా 3.76 కోట్లుగా తెలుస్తోంది. టికెట్ల కేటాయింపు దగ్గర నుంచే బీసీలకు అన్యాయం జరుగుతోంది. జనాభా ప్రకారం బీసీలకు సగం సీట్లు ఇస్తామని రాజకీయ పార్టీలు చెబుతున్నాయి. గెలుపు అవకాశాలు లేని స్థానాలకు బీసీలను పరిమితం చేస్తున్నారు. కులసంఘాల భవనాలకు స్థలం కేటాయింపులోనూ బీసీలకు అన్యాయం జరుగుతోంది. హైదరాబాద్‌కు 60 కిలోమీటర్ల దూరంలో బీసీ సంఘాల భవనాలకు స్థలం కేటాయిస్తున్నారు. అగ్రవర్ణాల వారి కులసంఘాల భవనాలకు మాత్రం జూబ్లీహిల్స్, బంజారాహిల్స్‌లో కేటాయించారు. బలహీనవర్గాల విషయంలో కేవలం తీర్మానాలు చేసి వదిలేస్తున్నారు. ఈ సర్వేలో హిందూ బీసీలు, ముస్లిం బీసీలు అని కొత్త పదాలు సృష్టించారు. కోర్టుల్లో కేసులు వేసి బీసీలకు రిజర్వేషన్ల పెంపును జాప్యం చేయాలని చూస్తున్నారు. కోర్టుల పేరు చెప్పి ప్రభుత్వం బీసీల రిజర్వేషన్ల పెంపును పక్కకు పెడుతోంది' అని ఆరోపించారు.

# మరిన్ని సివిల్ ఏవియేషన్ కాలేజీలు రావాలి

- కర్నాటక విజయపురికి విమానప్రయాణాలు సాగించండి
- రాజ్యసభలో ప్రశ్నించిన సుధామూర్తి





**న్యూఢిల్లీ,ఫిబ్రవరి4 :** దేశంలో మరిన్ని సివిల్ ఏవియేషన్ కాలేజీలు ఏర్పాటు చేయాలన్న రాజ్యసభ ఎంపీ సుధామూర్తి, విజయపురకు విమానాలు ఎప్పుడు వస్తాయని రాజ్యసభలో ప్రశ్నించారు. రాజ్యసభలో సుధామూర్తి మాట్లాడుతూ.. 'కర్ణాటకలో ప్రముఖ టూరిస్ట్ స్పాట్ విజయపుర. పర్యాటకుల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఎయిర్ పోర్ట్ సిద్ధం చేశారు. దీనిపై కర్ణాటక ప్రభుత్వంతో నేను మాట్లాడాను. కేంద్ర ప్రభుత్వం తమకు అనుమతి ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం చెప్పింది. ఈ సందర్భంగా ఓ విషయం అడుగుతున్నాను. విజయపురకు విమానాలు ఎప్పుడు ప్రారంభం కానున్నాయి. నేను ఎప్పుడు అడిగినా త్వరలోనే తెలుస్తుందని చెబుతున్నారు. ఈసారి అలా కాదు. కచ్చితంగా దీనిపై మాకు సమాధానం కావాలి. 54 సివిల్ ఏవియేషన్ కాలేజీలు ఉన్నాయి. 140 కోట్ల భారతీయులకు ఇది చాలా తక్కువ అని నా అభిప్రాయం. దేశ వ్యాప్తంగా ఎన్నో ప్రాంతాల్లో సివిల్ ఏవియేషన్ కాలేజీలు, కేంద్రాలు లేవు. దీనిపై కేంద్రం ఫోకస్ చేయాలి. ఇది మా రిక్వెస్ట్' అని సుధామూర్తి రాజ్యసభలో ప్రశ్న లేవనెత్తారు. సుధామూర్తి అడిగిన ప్రశ్నకు పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు స్పందించి ఇచ్చిన సమాధానం అందర్నీ ఆకట్టుకుంటోంది. రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ.. ఇది తిరుపతికి సంబంధించిన విషయం. అయితే సుధామూర్తిగారు విజయపుర పేరును ఇక్కడ ప్రస్తావించారు. విజయపురకు త్వరలోనే విమానాలు వస్తాయి. ఇదే ఏడాది అది అమలు చేస్తాం. కావాలంటే లిఖిత పూర్వకంగా మీకు సమాధానం ఇస్తాం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి దీనిని సాధ్యం చేస్తాం. సివిల్ ఏవియేషన్ కాలేజీలు 54 మాత్రమే ఉన్నాయి. అందులో పైలట్లతో పాటు మెయింటనెన్స్ ఇంజినర్లకు ట్రైనింగ్ ఇస్తారు. మరో 3 కాలేజీకు అప్రూవల్ వచ్చింది. మరో 9 ఏవియేషన్ కాలేజీల కోసం కేంద్రం చర్యలు ప్రారంభించింది. ప్రతి ఏడాది 1500కు పైగా పైలట్లు శిక్షణ తీసుకుంటున్నారు. దేశంలో మరికొన్ని కాలేజీలు అవసరం ఉంది కనుక ఎవరైనా ప్రైవేట్ సంస్థలు ఇందుకోసం ముందుకొస్తే కేంద్రం వారికి సహకారం అందిస్తుంది. వచ్చే 5 ఏళ్లలో దేశంలో 50 ఎయిర్ పోర్టులు అందుబాటులోకి రానున్నాయి. 10 ఏళ్లలో 100, 20 ఏళ్లలో 200 విమానాశ్రయాలు నిర్మించి విమాన సర్వీసులు అందించాలని కేంద్రం భావిస్తోంది. కానీ విమానాశ్రయాలతో పాటు అక్కడ పార్కింగ్, ఆ స్థాయిలో స్థలం సేకరణ లాంటి చాలా అంశాలు ఆలోచించాలి. మౌలిక సదుపాయాలు కల్పించడానికి మేం సిద్ధంగా ఉన్నాం. అవసరమైతే సుధామూర్తి గారితో ప్రత్యేకంగా సమావేశమై వివరాలు ఇస్తాం. సెషన్స్ లో మరోసారి ఈ విషయం ప్రస్తావన అవసరం లేదని' రామ్మోహన్ నాయుడు ఎంపీ సుధామూర్తి అడిగిన ప్రశ్నకు ఇచ్చి సమాధానం అందర్నీ ఆకట్టుకుంటోంది.

# ఎంపీఎంటీఎస్ ప్రయాణికులకు గుడ్‌న్యూస్



**హైదరాబాద్,ఫిబ్రవరి4 :** ప్రయాణికులకు దక్షిమ మధ్య రైల్వే ఓ గుడ్ న్యూస్ చెప్పింది. ఇప్పటికే చర్లపల్లి నుంచి పలు రైళ్లు నడుస్తుండగా.. త్వరలో ఎంఎంటీఎస్ సర్వీస్ లను మరింత పెంచనున్నట్టు సౌత్ సెంట్రల్ రైల్వే జీఎం అరుణ్ కుమార్ జైన్ ప్రకటించారు. ప్రస్తుతం చర్లపల్లి నుంచి ఒక ఎంఎంటీస్ నడుస్తుండగా.. మరో 4, 5 నెలల్లో ఈ సర్వీసులను మరిన్ని అందుబాటులోకి తెచ్చేందుకు ప్రణాళికలు చేస్తున్నామన్నారు. సికింద్రాబాద్ - గుంటూరు మార్గంలో డబ్లింగ్ పూర్తయితే మరికొన్ని రైళ్లు నడిపే వెసులుబాటు ఉంటుందని, మరో పక్క ఎక్స్ ప్రెస్ రైళ్లలోనూ జనరల్ బోగీల సంఖ్యను దశలవారీగా పెంచేందుకు పనులు సాగుతున్నాయని తెలిపారు. రైల్ నిలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడిన దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్ కుమార్ జైన్.. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ పునరాభివృద్ధి పనుల నేపథ్యంలో 10 జతల రైళ్లను తరలించనున్నామని తెలిపారు. ఈ రైళ్లకు అనుగుణంగా ఎంఎంటీఎస్ సర్వీసులుంటాయన్నారు. హైదరాబాద్ స్టేషన్, కాచిగూడ, సికింద్రాబాద్ స్టేషన్ పునరాభివృద్ధి పనులతో తలెత్తే ఒత్తిడిని తగ్గించేందుకు మరిన్ని రైళ్లను చర్లపల్లి నుంచి నడపాలని నిర్ణయించామని చెప్పారు. ప్రయాణికుల డిమాండ్ కు అనుగుణంగా చర్లపల్లి నుంచి మరిన్ని ఎంఎంటీఎస్ లు నడుపుతామని స్పష్టం చేశారు. చార్మినార్, గోరఖ్ పూర్ ఎక్స్ ప్రెస్ లను మార్చి నుంచి నడుపుతామని, మే నెలాఖరుకల్లా మరో 8 జతల రైళ్లను నడిపేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని జైన్ చెప్పారు. ఘట్ కేసర్ - యాదాద్రి ఎంఎంటీఎస్ లైన్ కోసం రూ.650 కోట్లు ఖర్చవుతుందని, దీనికి సంబంధించిన డీపీఆర్ ఇప్పటికే సిద్ధం చేశామని జైన్ అన్నారు. త్వరలో ఈ పనులు ప్రారంభమవుతాయని చెప్పారు. ఎంఎంటీఎస్ రెండో దశకు సంబంధించి, తెలంగాణ ప్రభుత్వం రూ.491 కోట్లు బకాయి పడిందని తెలిపారు. ప్రస్తుతం మౌలాలి నుంచి ఘట్‌కేసర్ వరకు ఎంఎంటీఎస్ ట్రైన్లు అందుబాటులో ఉన్నాయి. అక్కడి నుంచి యాదగిరిగుట్టకు కొత్తగా మూడో లైను వేయాల్సి ఉంది. ఇది పూర్తయితే కేవలం రూ.20 ఛార్జీతో హైదరాబాద్ నుంచి యాదగిరిగుట్టకు చేరుకోవచ్చు. ఇక రాష్ట్రంలో చేపట్టిన అమృత్ స్టేషన్ల అభివృద్ధి పనులు వచ్చే ఏడాది చివరి వరకు పూర్తవుతాయన్నారు. పింక్ బుక్ ను పార్లమెంటులో ఇంకా ప్రవేశపెట్టకపోవడంతో రైల్వే బడ్జెట్ కేటాయింపుల వివరాలను ఇప్పుడే వెల్లడించలేమని జైన్ చెప్పారు. ప్రాజెక్టులు, సర్వేలు, డీపీఆర్ లు, సౌకర్యాలు వంటి అంశాలన్నీ పింక్ బుక్ లోనే ఉంటాయన్నారు. ఇక ఈసారి రైల్వే బడ్జెట్‌లో తెలుగు రాష్ట్రాలకు భారీగానే కేటాయింపులున్నాయి. ఏపీకి రూ.9.417 కోట్లు, తెలంగాణకు రూ.5,337 కోట్లు కేటాయించామని కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. ఈ క్రమంలోనే కాజీపేటలో రైల్వే ప్రొడక్షన్ యూనిట్ ఏర్పాటు చేస్తామన్నారు.

# బంగారం ధరలకు రెక్కలు

## ట్రంపం నిర్ణయాలతో అంతర్జాతీయ ప్రభావం

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి4 :** మెరికా అధ్యక్షుడు ట్రంప్ తీసుకుంటున్న నిర్ణయాలు, బంగారం ధరలపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. కెనడా, మెక్సికో, చైనా ఉత్పత్తులపై టారిఫ్‌లు ప్రకటించిన ట్రంప్ .. తదుపరి మెక్సికోకు మాత్రం విరామం కల్పించారు. అమెరికా వస్తువులపై పన్ను విధిస్తామని కెనడా ప్రకటించగా, చైనా కూడా ప్రతిస్పందించనున్న నేపథ్యంలో సోమవారం అమెరికా సహా ప్రపంచవ్యాప్త స్టాక్‌మార్కెట్లు నష్టపోయాయి. అనిశ్చితి పరిస్థితుల్లో ఆర్థికంగా భరోసా ఇచ్చే పసిడిపైకి పెట్టుబడులు మళ్లడంతో అంతర్జాతీయ విపణిలో పుత్తడి ధర కొండెక్కింది. డాలర్ విలువ రూ.87.11కు చేరినందున, దేశీయంగా బంగారం ధర పెరుగుదల మరింత అధికంగా కనపడుతోంది. హైదరాబాద్ బులియన్ విపణిలో 10 గ్రాముల మేలిమి (24 క్యారెట్లు/999 స్వచ్ఛత) బంగారం ధర తొలిసారిగా సోమవారం రూ.86,000ను తాకింది. అంతర్జాతీయంగా ఔన్సు (31.10 గ్రాముల) ధర 2,829.57 డాలర్లకు చేరడం ఇందుకు నేపథ్యం. అయితే తదుపరి కొంత లాభాల స్వీకరణతో రాత్రి 11.30 గంటల సమయానికి ఔన్సు బంగారం ధర 2820 డాలర్లకు దిగి రావడంతో, హైదరాబాద్ బులియన్ విపణిలోనూ రూ.85,880 వద్ద ట్రేడ్ అవుతోంది. ఇది కూడా ఇప్పటివరకు బంగారానికి గరిష్ఠస్థాయే. జనవరి 30న తొలిసారిగా 10 గ్రా.మేలిమి బంగారం ధర రూ.84,000కు, మరుసటిరోజు రూ.85,000ను తాకగా, సోమవారం రూ.86,000కు చేరడంతో కొనుగోలుదార్లు బెంబేలెత్తుతున్నారు. కిలో వెండి ధర రూ.96,400 వద్ద ఉంది.

# కులగణన లెక్కలపై చర్చ జరగాలి

**మండలిలో బిఆర్ఎస్ నేతలు కవిత, చారి డిమాండ్**

**చర్చ అనంతరం మండలి నిరవధికంగా వాయిదా వేసిన గుత్తా**



**హైదరాబాద్,ఫిబ్రవరి4 :** తెలంగాణ అసెంబ్లీ ప్రత్యేక సమావేశం సందర్భంగా ఉభయ సభల్లో కులగణన , ఎస్సీ వర్గీకరణ అంశాలపై చర్చ జరిగింది. ఈ చర్చలో శాసనమండలిలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత, శాసనమండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధు-సూదనాచారి మాట్లాడారు. మధుసూదనాచారి మాట్లాడుతూ, కులగణన లెక్కలపై సమగ్ర చర్చ జరగాల్సిన అవసరం ఉందని, తమకు ఈ విషయంలో తగిన అవకాశం ఇవ్వాలని కోరారు. ఆయన చెప్పిన ప్రకారం, ఈ డేటా వివరాలు ఇప్పటివరకు అందరికీ అందుబాటులో లేవని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ తమ మేనిఫెస్టోలో బీసీలకు అనేక హామీలు ఇచ్చి అధికారం లోకి వచ్చిందని, కానీ ప్రభుత్వం కొంత కాలయాపన చేశిందని విమర్శించారు. అటు, కోర్టు జోక్యం చేసుకున్న తర్వాత కులగణన జరగిందని ఆయన వెల్లడించారు. కులగణనపై ప్రజలు ఆశలు పెట్టుకున్నారని, కానీ ప్రస్తుతం జరుగుతున్న సర్వేను కొండను తవ్వి ఎలుకను పట్టినట్టు అభివర్ణించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కుటుంబ సర్వే నిర్వహించినప్పుడు, దానికి విదేశాల్లోని తెలంగాణవారు కూడా పాల్గొన్నారని కవిత గుర్తుచేశారు. కానీ, ఇప్పుడు చేసిన సర్వేలో బీసీ జనాభా 20 లక్షల మేర తగ్గినట్లు ఆరోపించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆ డేటాను బయట పెట్టే అంశాన్ని ఆశించామని, కానీ అసెంబ్లీలో మంత్రి మాట్లాడుతూ, ఈ డేటాతో ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోవాలని ఉద్దేశించింది అనే ఎ÷-లాన్ ఆఫ్ యాక్షన్ ఏమీ ప్రకటించలేదని ఆమె వ్యాఖ్యానించారు. కవిత, బీసీలకు హామీలను పటిష్టంగా అమలు చేస్తారా అని ప్రశ్నించారు. ఆమె మాట్లాడుతూ, ప్రభుత్వం చెప్పినట్లు కులగణనలో ఓసీల జనాభా పెరిగిందని, మిగతా కులాల జనాభా ఎందుకు తగ్గిందని ప్రశ్నించారు. ఈ సందర్భంగా, కులగణనపై కొనసాగుతున్న చర్చలు, ప్రభుత్వం తీసుకునే చర్యలు ఇంకా స్పష్టతకు రాలేదు. అయితే.. ఈ క్రమంలోనే తెలంగాణ శాసనమండలిని మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి నిరవధిక వాయిదా వేశారు,

# యధాతథంగా పాతపన్ను విధానం

**రద్దు చేసే ఆలోచన లేదన్ననిర్మలా సీతారామన్**



**న్యూఢిల్లీ,ఫిబ్రవరి4:** యధాతథంగా పాతపన్ను విధానం ఉంటుందని, దానిని రద్దు చేసే ఆలోచన లేదని ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు. కొత్త పన్ను విధానాన్ని మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దిన నేపథ్యంలో పాత పన్ను విధానాన్ని రద్దు చేస్తారన్న ప్రచారం నేపథ్యంలో దీనిపై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పందించారు. పాత పన్ను విధానం రద్దు చేసే ఆలోచన లేదని స్పష్టం చేశారు. ఇండియాటుడే- బిజినెస్‌టుడే నిర్వహించిన 2025 రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న సందర్భంగా దీనిపై మాట్లాడారు. 'పన్ను చెల్లింపుదారులందరూ కొత్త పన్ను విధానంలోకి మారాలని మీరు భావిస్తున్నారా?' అంటూ ఎదురైన ప్రశ్నకు నిర్మలా సీతారామన్ స్పందిస్తూ.. పాత పన్ను విధానం రద్దు చేయాలన్న ప్రతిపాదన తమ వద్ద లేదన్నారు. పన్ను ఫైలింగ్ విధానం సరళంగా ఉండాలనే ఉద్దేశంతో కొత్త పన్ను విధానం తీసుకొచ్చినట్లు చెప్పారు. కొత్తగా తీసుకురాబోయే ఆదాయపు పన్ను చట్టం గురించి కూడా ఈ సందర్భంగా ప్రస్తావన వచ్చింది. 1961లో తీసుకొచ్చిన పాత ఆదాయపు పన్ను చట్టం స్థానంలో అనేక మార్పులు, చేర్పులతో కొత్త ఆదాయపు పన్ను చట్టాన్ని ప్రవేశపెట్టనున్నట్టు వెల్లడించారు. మరికొద్ది రోజుల్లో ప్రవేశపెట్టబోయే ఈ బిల్లు పార్లమెంటులో ఆమోదం పొందుతుందని భావిస్తున్నట్లు ఆమె తెలిపారు.

# నేనే మిమ్మలను కలుసుకుంటా

**నన్ను కలిసేందుకు రావద్దు.. అభిమానులకు జూనియర్ ఎన్టీఆర్ వినతి**




**హైదరాబాద్,ఫిబ్రవరి4 :** తనపై అభిమానులు చూపిస్తున్న ప్రేమకు ఎన్టీఆర్ (జె÷ఖీ) కృతజ్ఞతలు తెలిపారు. తనను కలుసుకోవడానికి పాదయాత్రల్లాంటివి చేయొద్దని వారికి విజ్ఞప్తి చేశారు. వారి ఆనందమే కాదు సంక్షేమం కూడా తనకు ముఖ్యమన్నారు. తనను కలుసుకోవాలని ఎదురుచూస్తున్న అభిమానుల ఆసక్తిని అర్థం చేసుకుని.. త్వరలో వారి కోసం ఓ సమావేశం ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.ఆ సమావేశానికి సంబంధించి పోలీసుల అనుమతి, అధికారులతో సమన్వయం, శాంతి భద్రతల సమస్య రాకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఇందుకు కొంత సమయం పడుతుందని, అప్పటి వరకు అభిమానులు ఓపికగా ఉండాలని ఎన్టీఆర్ కోరారు. సంబంధిత స్టేట్‌మెంట్‌ను ఎన్టీఆర్ టీమ్ విడుదల చేసింది. కుప్పం నుంచి పాదయాత్ర చేసి హైదరాబాద్‌లో పలువురు ఫ్యాన్స్ ఎన్టీఆర్‌ను ఇటీవల కలిసిన సంగతి తెలిసిందే. సినిమాల విషయానికొస్తే.. 'దేవర'తో గతేడాది విజయాన్ని అందుకున్న ఎన్టీఆర్ ప్రస్తుతం 'వార్ 2'తో బిజీగా ఉన్నారు. ఇందులో హృతిక్ రోషన్ మరో హీరో. 'కేజీయఫ్' ఫేమ్ ప్రశాంత్ నీల్‌తో ఎన్టీఆర్ ఇప్పటికే ఓ సినిమా ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ యాక్షన్ మూవీకి 'ఎంటర్ ది డ్రాగన్', 'ఎన్టీఆర్ ది డ్రాగన్' లాంటి పేర్లను టైటిల్‌గా పెట్టే ఆలోచనలో చిత్ర బృందం ఉందని ఇటీవల వార్తలొచ్చాయి. ఇందులో రుక్మిణీ వసంత్ హీరోయిన్‌గా ఎంపికైనట్టు సమాచారం. వచ్చే ఏడాది సంక్రాంతికి ఈ సినిమాని విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

ఉద్యమ కెరటం
నిజం.. రక్షిత రక్షితః
తెలుగు దినపత్రిక
UDYAMA KERATAM TELUGU DAILY
www.udyamakeratam.com



# వికసిత భారత్ తమ ధృడసంకల్పం



- ఆ లక్ష్యం దిశగా పయనిస్తున్నాం
- రాష్ట్రపతి ప్రసంగంలో ఇదే స్పష్టం చేశాం
- రాబోయే 25 ఏళ్ల కాలానికి ప్రజల్లో విశ్వాసం పాదుకొల్పాం
- తప్పుడు హామీలతో ప్రజలను మోసం చేయడం లేదు
- కొందరు సెల్ఫీలు దిగుతూ.. అద్దాల మేడల్లో ఉంటారు
- ప్రతి రూపాయి గ్రామానికి చేరుకునేలా చూస్తున్నాం
- రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాద తీర్మానానికి మోడీ సమాధానం

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి4 :** రాష్ట్రపతి ప్రసంగం 'వికసిత్ భారత్' లక్ష్యంపై దేశ ధృఢసంకల్పాన్ని పునరుద్ఘాటించిందని ప్రధాని మోడీ అన్నారు. రాష్ట్రపతి ప్రసంగం తమలో ఆత్మవిశ్వాసం నింపిందని, మరోసారి తమ ప్రభుత్వాన్ని ఎన్నుకున్నందుకు ప్రజలకు కృతజ్ఞతలని చెప్పారు. రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాద తీర్మానానికి పధ్నాలుగు సార్లు సమాధానం ఇచ్చే అదృష్టాన్ని దేశ ప్రజలు తనకు ఇచ్చారని, ఇందుకు తాను ప్రజలందరికీ కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. పార్లమెంటులో రాష్ట్రపతి చేసిన ప్రసంగంపై ధన్యవాద తీర్మానానికి లోక్‌సభలో ప్రధాని సమాధానమిస్తూ, 'మనం 2025లో ఉన్నారు. ఒకరకంగా 21వ శాతాబ్దంలో 25 శాతం ముగిసిపోయింది. 20వ శతాబ్దంలో స్వాతంత్ర్యం తరువాత, 21వ శతాబ్దంలో 25 ఏళ్లలో ఏం జరిగిందనేది కాలమే చెబుతుంది. రాష్ట్రపతి ప్రసంగాన్ని జాగ్రత్తగా గమనిస్తే, రాబోయే 25 ఏళ్లలో, వికసిత్ భారత్ దిశగా ప్రజల్లో విశ్వాసం పాదుకొలపే దిశగా పనిచేయనున్నాం. వికసిత్ భారత్ లక్ష్యాన్ని రాష్ట్రపతి ప్రసంగం ప్రతిబింబించింది. సరికొత్త ధీమాను కల్పిస్తూ, సామాన్య ప్రజానీకానికి స్ఫూర్తిగా నిలిచిందని మోదీ అన్నారు. 'గరీబీ హటోవా' నినాదంపై మాట్లాడుతూ. ప్రభుత్వం తప్పుడు హామీలు ఇవ్వదని, ప్రజలకు నిజమైన అభివృద్ధిని అందిస్తుందని ప్రధాని అన్నారు. ఇంతవరకూ పేదలుకు 4 లక్షల గృహాలు ఇచ్చామని, గతంలో మహిళలు బహిర్భూమి సిస్టమ్ లేక అవస్థలు పడవారని, ఎవరైతే అన్ని సౌకర్యాలు ఉన్నారో వారికి ఇలాంటి అవసరాలు అర్థం కావని పరోక్షంగా ప్రతిపక్ష కాంగ్రెస్‌కు చురకలు వేశారు. పేదల కోసం 12 కోట్లకు పైగా మరుగుదొడ్లు నిర్మించామని అన్నారు. గత ఐదు దశాబ్దాలుగా 2కోట్ల మంది ప్రజలను పేదరికం నుంచి బయటపడేశామని చెప్పారు. అంకితభావంతో పథకాలు అమలు చేసినప్పుడే ఇలాంటి మార్పు సంభవమని అన్నారు. పేదల గురించి ఉత్తుత్తి హామీలు తాము ఇవ్వమని, అభివృద్ధి చేసి చూపిస్తామని చెప్పారు. పేదలు, సామాన్య ప్రజలు, మధ్యతరగతి సవాళ్లను అవగాహన చేసుకుని, వాటిని అధిగమించేలా చేసేందుకు కట్టుబడి ఉంటామని చెప్పారు. 'ప్రజల సొమ్ము ప్రజల చేతికే' అనేది మా నినాదం. డిజిటల్ సాంకేతికత ద్వారా పారదర్శకత పెంచాం. పది కోట్ల నకిలీ ఖాతాలను గుర్తించి తొలగించాం. ఇథనాల్ బ్లెండింగ్ ద్వారా విదేశీ మారక ద్రవ్యాన్ని ఆదా చేశాం. గతంలో తరచూ రూ.లక్షల కోట్ల అవినీతిపై రోజూ వార్తలు వచ్చేవి. గత పదేళ్లుగా కేంద్ర ప్రభుత్వంపై అవినీతి ఆరోపణలే లేవు. మా హయాంలో మౌలిక వసతుల కల్పనపై భారీగా వెచ్చించాం. కేంద్రంలో పదేళ్లుగా అవినీతి లేకపోవడంతో జనం లాభపడ్డారు. ఆయుష్మాన్ భారత్, జన్ ఔషధి కేంద్రాల ఏర్పాటుతో రోగులకు ఎంతో మేలు జరిగిందన్నారు. మా హయాంలో ప్రతి రూపాయిని ప్రజల కోసమే ఖర్చు చేస్తున్నాం. ప్రజల డబ్బును మేం అద్దాల మేడలు నిర్మించడానికి ఉపయోగించలేదు.. దేశాభివృద్ధికి వినియోగించాం. ప్రపంచ గేమింగ్ రాజధానిగా భారత్ తయారవుతోంది. మే అధికారంలోకి రాకముందు ఎల్‌ఈడీ బల్బు ధర రూ.400 ఉండేది. మా ప్రభుత్వం రాగానే ఎల్‌ఈడీ బల్బును రూ.40కే పంపిణీ చేశాం. దీని ద్వారా దేశ ప్రజలకు రూ.20వేల కోట్లు ఆదా అయింది. మా పాలన బాగుండటం వల్లే మళ్లీ గెలుస్తున్నాం. హరియాణాలో మూడోసారి అధికారంలోకి వచ్చాం. మహారాష్ట్రలోనూ తిరిగి అధికారంలోకి వచ్చాం'అని ప్రధాని వివరించారు. అలాగే ప్రధాని తన ప్రసంగంలో రాహుల్ గాంధీ, కేజ్రీవాల్‌పై పరోక్ష విమర్శలు గుప్పించారు. రాష్ట్రపతి ప్రసంగం బోరింగ్‌గా ఉందంటూ రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలను పరోక్షను ప్రస్తావిస్తూ, పేదల గుడిసెల్లో ఫోటో సెషన్లతో సరదాగా గడిపేవారికి పార్లమెంటులో పేదల గురించి మాట్లాడుతూ చేసే ప్రసంగాలు బోర్‌గానే ఉంటాయని అన్నారు. కొందరు నాయకులు విలాసవంతమైన షవర్లు కోరుకుంటారని, తమ ప్రభుత్వం మాత్రం ప్రతి ఇంటికి నీళ్లు ఇవ్వడంపై దృష్టిసారిస్తుందని కేజ్రీవాల్ విలాసవంతమైన శీష్ మహల్ పై పరోక్ష విమర్శలు గుప్పించారు. ఢిల్లీ నుంచి రూపాయి పంపితే గ్రామలకు 16 పైసలే చేరుతోందని గతంలో ఒక ప్రధాని వాపోయారని, ఢిల్లీ నుంచి గల్లీ వరకూ అప్పట్లో అదే పరిస్థితి ఉండేదని ప్రధాని అన్నారు. అయితే ఇప్పుడు ఢిల్లీ నుంచి రూపాయి పంపితే గ్రామానికి రూపాయి అందుతోందని, నగదు బదిలీతో నేరుగా ప్రజలకే సొమ్ము అందుతోందని వివరించారు. ప్రధాని ప్రసంగిస్తున్నంత సేపు అధికారపక్షం సభ్యులు చప్పట్లతో అభినందించారు.



## ధూమపానం, గుట్కాలతో
# క్యాన్సర్
## వాటికి దూరంగా ఉండడమే మేలు

**హైదరాబాద్, ఫిబ్రవరి 4:** ఈ మధ్య క్యాన్సర్ మరణలు పెరిగాయి. పొగాకు, గుట్కా వంటి అలవాట్లతో పాటు, ఆహార పదార్థాల వల్ల కూడా క్యాన్సర్ వ్యాపిస్తోంది. క్యాన్సర్ ఆస్పత్రులు జనరల్ ఆస్పత్రులకన్నా కిటకిటాడుతున్నాయి. ఇది సోకిన వారు బతికి బట్టికట్టిన దాఖలాలు ఉండడం లేదు. ఏ స్టేజీలో ఉన్న మరణం తప్పడం లేదు. మంగళవారం నాడు ప్రపంచ కాన్సర్ దినోత్సవం. ఈ సందర్భంగా ..స్మోకర్స్ కు పొగాకు ఉత్పత్తుల వల్ల కలిగే అనర్థాల పై అవగాహన కలిగి ఉంటే మంచిది. ప్రధానంగా గుట్కా,ధూమపానం ప్రాణాలను హరించేస్తోంది. ఆరోగ్యవంతమైన జీవనాన్ని ఆస్వాదించాలంటే పొగాకు, గుట్కాలకు దూరంగా ఉండాలి. పొగ తాగడం వ్యసనంగా మారక ముందే ఫుల్ స్టాప్ పెట్టడం మంచిదని వైద్యులు సూచిస్తున్నారు. పొగాకు, ధూమపానం అలవాట్లను మాన్పించడంలో సమాజంలో ప్రత ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలి. పొగాకు ఉత్పత్తులను ముందుగా అమ్మకుండా నిషేధించాలి. వాటిని తయారు చేయకుండా ఆంక్షలు విధించాలి. యువత సైతంచెడు స్నేహం వల్లో, సాంగత్య ప్రభావం వల్లనో పొగాకు అలవాటు చేసుకుంటున్నారు. అందుకే కాలేజీలకు వెళ్లే విద్యార్థులపై తల్లిదండ్రులు ఓ కన్నేసి ఉంచాల్సిన అవసరం ఎంతైనా ఉంది. సరదాగా మొదలయ్యే అలవాటు వల్ల జీవితం అవాంఛనీయ ఘటనలకు దారి తీయటం వాంఛనీయం కాదు. యోగా చేయడం, ఏదైనా ఇతర పనులపై దృష్టి పెట్టడం ద్వారా కూడా దమ్ము కొట్టాలి అన్న ఆలోచనను క్రమ క్రమంగా దూరం చేసుకోవచ్చని వైద్యులు సూచిస్తున్నారు. అద్భుత ఫలితాన్ని సాధించవచ్చు అని చెప్పారు. పొగాకుతో క్యాన్సర్ ఎలా వస్తుంది అనే విషయం చెప్పటానికి, తెలుసుకోవటానికి వైద్యం చదవవసరం లేదు. సిగరెట్, బీడీ తాగితే పొగాకుతో పెనవేసుకున్న రసాయనాలు శరీరంలోకి ప్రవేశించి కణాల డిఎన్‌ఏను నాశనం చేసే పనిలో పడతాయి. సిగరెట్ అలవాటుకు ముందు, ఆ తర్వాత ఆరోగ్యం గురించి చెప్పొచ్చు. పొగ తాగడం, గుట్కా తినడం అంటే మృత్యువుకు 'దగ్గర' అయ్యే అవకాశాలే అధికంగా ఉన్నాయి. సిగరెట్ ,బీడీ కాల్చినపుడు వాటి నుంచే వెలువడే రసాయనాలు ఎంతటి ఉక్కు లాంటి కందరాల్ని ఐనా తుప్పు పట్టించే పనిలో ఉంటాయి. పటిష్ట మైన ఆరోగ్యం పునాదులను దారుణంగా దెబ్బ తీస్తాయి. కణాలుఅడ్డగోలుగా పెరిగేలా కారకం అవుతాయి తద్వారా కేన్సర్ కు దారి తీస్తాయి. ఆరోగ్యం గా ఉన్న కణాల డి ఎన్ ఏ ను దెబ్బ తీస్తాయి. అంటే శరీరం ఆకృతి ఇచ్చే కణాల పై ప్రభావం చూపుతాయి.



# అంతరిక్షంలోనే చిక్కుకున్న సునీతా విలియమ్స్

## భూమ్మీదకు తెచ్చే ప్రయత్నంలో మరింత ఆలస్యం





**న్యూమార్క్, ఫిబ్రవరి 4:** జీరో గ్రావిటీ వద్ద కొన్ని నెలలుగా తేలియాడుతుండటంతో నేలపై నడిచిన అనుభూతిని గుర్తు తెచ్చుకోలేకపోతున్నానని సునీతా విలియమ్స్ ఇటీవల చెప్పారు. ఆమె ఆరోగ్యం కూడా విషమించిందన్న వార్తలు వచ్చాయి. ఆమెను తిరిగి భూమి మీదకు రప్పించే ప్రయత్నాలపై అనుమానాలు వస్తున్నాయి. తమ మిషన్ ప్రకారం నెల రోజుల్లోపే అంతరిక్షం నుంచి తిరిగి రావాలి. కానీ, ఇంతకాలం ఇక్కడ ఉండటం కొంచెం షాకింగ్‌గా అనిపిస్తోందనీ అన్నారు. సునీతా విలియమ్స్, బుచ్ విల్‌మోర్ గతేడాది జూన్ 6న బోయింగ్ స్టార్‌లైనర్ క్యాప్సుల్‌లో అంతరిక్ష కేంద్రానికి వెళ్లారు. వాస్తవానికి అదే నెల 14వ తేదీన వీరిద్దరూ భూమికి తిరుగు పయనం కావాల్సి ఉండగా.. వ్యోమనౌకలో హీలియం లీకేజీ కారణంగా సాంకేతిక సమస్యలు ఎదురయ్యాయి. దీంతో ఇద్దరూ ఏడు నెలలుగా అంతరిక్ష కేంద్రంలోనే చిక్కుకుపోయారు. అంతరిక్షంలో చిక్కుకుపోయిన వ్యోమగాములు సునీతా విలియమ్స్, బుచ్ విల్‌మోర్‌లను సురక్షితంగా భూమ్మీదకు తీసుకురావాలని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తమ సాయం కోరినట్లు 'స్పేస్ ఎక్స్' అధినేత ఎలాన్ మస్క్ అన్నారు. త్వరలో ఈ పనిని పూర్తిచేస్తామని 'ఎక్స్'లో పోస్టు పెట్టారు. వారిద్దరినీ తిరిగి భూమి పైకి తీసుకువచ్చేందుకు బైడెన్ ప్రభుత్వం ఎలాంటి ప్రయత్నం చేయలేదని.. వారు చేసిన ఆలస్యం వల్ల వ్యోమగాములు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని విమర్శించారు.

# నేడు ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు

## పకడ్బందీ ఏర్పాట్లు చేసిన ఎన్నికల సంఘం
## హ్యాట్రిక్ విజయం సాధించాలని ఆప్ పోరాటం




న్యూఢిల్లీ,ఫిబ్రవరి4(ఆర్ఎన్ఎ): బుధవారం ఢిల్లీలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. మొత్తం 70 అసెంబ్లీ స్థానాలకు ఒకే విడతలో పోలింగ్ నిర్వహించనున్నారు. ఢిల్లీ ఎన్నికల కోసం కేంద్ర ఎన్నికల సంఘం ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తిచేసింది. ఢిల్లీలోని 70 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని మొత్తం 1.56 కోట్ల మంది ఓటర్లు బుధవారం తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఈ ఎన్నికల కోసం కేంద్ర ఎన్నికల సంఘం ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తిచేసింది. ఢిల్లీలోని 70 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని మొత్తం 1.56 కోట్ల మంది ఓటర్లు రేపు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. బుధవారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరుగుతుంది. ఫిబ్రవరి 8న ఓట్లను లెక్కించి ఫలితాలను వెల్లడించనున్నారు. మొత్తం ఎన్నికల పక్రియ ఫిబ్రవరి 10 తో ముగియనుంది. ఢిల్లీలోని 70 నియోజకవర్గాల్లో 58 జనరల్ సీట్లు కాగా.. మరో 12 ఎస్సీ రిజర్వ్‌డ్ సీట్లు. మొత్తం 1.56 కోట్ల మంది ఓటర్లలో 83.49 లక్షల మంది పురుష ఓటర్లు కాగా.. 71.74 లక్షల మంది మహిళా ఓటర్లు ఉన్నారు. వారిలో 20 నుంచి 29 ఏళ్ల వయస్సు గల యువ ఓటర్ల సంఖ్య 25.89 లక్షలుగా ఉంది. 18 నుంచి 19 సంవత్సరాల వయస్సు గల తొలిసారి ఓటేసే వారి సంఖ్య 2.08 లక్షలు. ఎన్నికల నేపథ్యంలో ప్రత్యేక అవసరాలు ఉన్న వారి కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు అధికారులు ప్రకటించారు. పీడబ్ల్యూడీ వర్గం నుంచి 79,430 మంది ఓటర్లు ఉన్నారు. ఇక 100 సంవత్సరాలు దాటిన ఓటర్ల సంఖ్య 830 గా ఉంది. 85 ఏళ్ల వయస్సు దాటిన ఓటర్లు 1.09 లక్షల మంది ఉన్నారు. ఢిల్లీలో ట్రాన్స్‌జెండర్ ఓటర్ల సంఖ్య 1,261 గా ఉంది. ఈ ఎన్నికల్లో మరోమారు అధికారం దక్కించుకుని హ్యాట్రిక్ కొట్టాలని ఆప్ భావిస్తోంది. బిజెపి దీటుగా ప్రచారం నిర్వహించింది. కాంగ్రెస్ కూడా ఒంటరి పోరాటం చేస్తోంది. తృణమూల్, సమాజ్‌వాది పార్టీలు ఆప్‌కు మద్దతుగా నిలిచాయి.





ఉద్యమ కెరటం
నిజం.. రక్షతి రక్షితః
తెలుగు దినపత్రిక
UDYAMA KERATAM TELUGU DAILY
www.udyamakeratam.com
బుధవారం
5 ఫిబ్రవరి 2025


## మూడు ప్రభుత్వ కొలువులు సాధించిన

# రాంచందర్



**ఉద్యమ కెరటం, దహెగాం : ప్రభుత్వ కొలువు సాదించాలంటే చాలా కష్టపడాలి, ఎంతో ఓపిక ఉండాలి. ఈ రోజుల్లో ఒక ప్రభుత్వ ఉద్యగం సాధించడమే కష్టం అలాంటిది కుమురం భీం దహెగాం మండలం పెసరికుంట గ్రామానికి చెంన కామెర హెూక్టు -లక్ష్మి దంపతుల ఏకైక కుమారుడైన కామెర రాంచందర్ ఏకంగా మూడు ప్రభుత్వం ఉద్యోగాలు సాధించాడు. వారి వ్యవసాయ కుటుంబం అతను చదివిందంతా ప్రభుత్వ పాఠశాలలోనే, చిన్నప్పటి నుండి చాలా కష్టపడి చదివి మూడు ప్రభుత్వ కొలువులు సాధించి యువతకు ఆదరంగా నిలిచాడు.**

కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా దహెగాం మండలంలోని పెసరికుంట గ్రామానికి చెంన కామెర హెూక్టు -లక్ష్మి వ్యవసాయం చేసుకుంటా చాలా కష్టపడి కుమారుడిని చవించారు. తల్లిదండ్రుల కష్టాన్ని అర్థం చేసుకొని ఎలాగైనా ప్రభుత్వ ఉద్యోగం సాదించాలనుకున్నాడు. కష్టపడి చదివి ఏకంగా మూడు ప్రభుత్వ కొలువులు సాధించారు. తన కుమారుడు ప్రభుత్వ ఉద్యగం సాధించినందుకు చాలా సంతోషించారు. ఉపాధ్యాయ (SGT) ఉద్యోగం ,గ్రూప్ 4 జూనియర్ అసిస్టెంట్ (వైద్య విధాన పరిషత్) ఉద్యోగం , TGNPDCLలో జూనియర్ అసిస్టెంట్ కొలువులు సాధించారు. ప్రస్తుతం అతను TGNPDCL జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం ఆసిఫాబాద్ లో చేస్తున్నాడు.



## గ్రూప్ 1 సాధించడమే లక్ష్యం

ప్రభుత్వ ఉద్యోగులు సాధించడమే లక్ష్యంతో పట్టుదలతో చదివాను. యువత అనుకుంటే ఈ ప్రపంచంలో సాధించలేదు. మూడు ఉద్యోగాలను ఏకకాలంలో సాధించడానికి ఒకరకంగా నా మేనమామ ప్రభుత్వ ఉపాధ్యాయుడు వెంకటేష్ ఆదర్శం. ఆయన సలహాలు సూచనలు పాటిస్తూ ప్రిపరేషన్తో ఉద్యోగాలను సాధించాను. రాబోయే రోజుల్లో గ్రూపు వన్ సాధించి పేద మధ్యతరగతి యువతులకు చేయూత అంంచడమే నా లక్ష్యం. ప్రతి ఒక్కరూ కష్టపడి ఎన్ని కష్టాలు ఉన్న చదవాలి. ఒక లక్ష్యాన్ని ఎంచుకొని ముందుకు సాగినప్పుడే లక్ష్యం నెరవేరుతుం.

- కామెర రామచందర్



# మెరుగైన వైద్య సేవలందించాలి

- జిల్లా కలెక్టర్ రాజర్షి షా
- నార్నూర్ ఆస్పత్రిని ఆకస్మిక తనిఖీ



**ఉద్యమ కెరటం, ఆలాబాద్ :** ఆసుపత్రికి వచ్చే వైద్య సిబ్బం మెరుగైన వైద్య సేవలు అంంచాలని కలెక్టర్ రాజార్షి షా అన్నారు. మంగళవారం నార్నూర్ మండలంలోని ఏరియా ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రసూతి వార్డులను, రక్త నిల్వ యూనిట్ గని సందర్శించి పరికరాలను పరిశీలించి అవసరమైన సిబ్బంని త్వరగా నియమించి ప్రారంభించాలని అన్నారు. అనంతరం ప్రసూతి వార్డు, స్కానింగ్, మరుగుదొడ్ల శుభ్రతను పరిశీలించారు. ఆసుపత్రిలో జరిగిన సాధారణ ప్రసవాలపై వైద్య సిబ్బంని అడిగి తెలుసుకొని రిజిస్టర్ లో నమోదు చేసిన వివరాలను పరిశీలించారు. మరుగుదొడ్లు రోజూ శుభ్రం చేయాలనీ, ఎక్కడైనా డ్యామేజ్ అయితే మరమ్మత్తులు చేయించాలని అన్నారు. వైద్య సిబ్బంది ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉండాలన్నారు. సాధారణ ప్రసవాలు జరిగేలా ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఆస్పత్రి పరిసరాలు, మరుగుదొడ్లు తదితర వాటిని నిరంతరం శుభ్రం చేస్తుండాలన్నారు. కలెక్టర్ వెంట జిల్లా వైద్యాధికారి రాథోడ్ నరేందర్ , ఆర్. నరసింహ రావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మనోహర్,అడిషనల్ డిఎంహెచ్ఓ తదితరులు ఉన్నారు.

## బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్‌కు సన్మానం



**ఉద్యమ కెరటం, తాండూర్:** బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ గా నియమితులైన నౌనూరి సుధీర్ గౌడ్ ను బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి ఏముర్ల ప్రదీప్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సన్మానించారు. అనంతరం నౌనూరి సుధీర్ గౌడ్ మాట్లాడుతూ తనకు అవకాశం కల్పించిన రాష్ట్ర, జిల్లా నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు కేశెట్టి విజయ్ కుమార్, బీజేపీ తాండూర్ మండల ప్రధాన కార్యదర్శులు ఉప్పుట్ల దుర్గచరణ్, కోమండ్ల శ్రీనివాస్, బీజేవైఎం మండల అధ్యక్షులు మామిడి విఘ్నేష్, కార్యదర్శి అరికెల శంకర్, రాచర్ల సురేష్, గుజ్జేటి శేఖర్, ఏముర్ల ప్రవీణ్, జాడి ప్రశాంత్, బొమ్మెల్లి శ్రావణ్, దుర్గి బీరేష్, రామగిరి గణేష్ పాల్గొన్నారు.




# క్యాన్సర్‌పై అవగాహన కలిగి ఉండాలి

## కలెక్టర్ అభిలాష అభినవ్

**ఉద్యమ కెరటం, నిర్మల్ టౌన్ :** క్యాన్సర్ వ్యాధిపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. సోన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన అవగాహనా కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 4న ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని జరుపుకుంటామని, దీని ప్రధాన ఉద్దేశ్యం క్యాన్సర్ గురించి అవగాహన పెంచడం నివారణా చర్యలను ప్రోత్సహించడం ఈ వ్యాధితో పోరాడుతున్న వారిని ప్రోత్సహించడం అని తెలిపారు. మారుతున్న జీవనశైలి కారణంగా సమాజంలో క్యాన్సర్ వ్యాధి తీవ్ర రూపం దాలుస్తుందన్నారు. ప్రజల నిత్య జీవన విధానంలో ఆరోగ్యకరమైన జీవనశైలి పాటించడం మెరుగైన ఆరోగ్య అలవాట్లను పెంపొందించుకోవడం వల్ల క్యాన్సర్ వ్యాధి రాకుండా ఉంటుందన్నారు. అనంతరం ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించి అందిస్తున్న చికిత్సలకు కలెక్టర్ వైద్యులను అడిగితెలుసుకున్నారు. రోగనిర్ధారణ గది మందుల గది బయటి రోగుల లోపలి రోగుల విభాగాలను తనిఖీ చేశారు. వైద్యులు సిబ్బంది సమయపాలన పాటిస్తూ విధులు నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి రాధిక, వైద్యులు శ్రీనివాస్, తహసీల్దార్ మల్లేష్, ఎంపీడీవో సురేష్, ఆసుపత్రి సిబ్బంది, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధికి 15 కోట్లు



**ఉద్యమ కెరటం, నేరడిగొండ :** జిల్లా ఇన్ చార్జి మంత్రి సీతక్క చొరవతో బోథ్ నియోజకవర్గ అభివృద్ధికి రూ.15 కోట్లు మంజూరైనట్లు కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ తెలిపారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. సీఆర్ఆర్ గ్రాంట్ ద్వారా రూ.5కోట్లు, ఎస్సీ సబ్ ప్లాన్ కింద రూ.10 కోట్లు వివిధ గ్రామాల్లో మౌలిక వసతులు కల్పనకు మంత్రి సీతక్క మంజూరు చేయించారని, ఆమెకు నియోజకవర్గ ప్రజల తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. త్వరలోనే దాదాపు 100 కోట్లతో ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్ రోడ్లకు మహర్దశ పట్టనున్నదని చెప్పారు.

## నేడు ఆలయంలో బహిరంగ వేలం

**ఉద్యమ కెరటం, బెల్లంపల్లి:** బెల్లంపల్లి బుగ్గ ఆలయంలో మహా శివరాత్రి పర్వదిన సందర్భంగా కొబ్బరి కాయలు అమ్ముకునేందుకు, వాహనాల పార్కింగ్, తై బజార్ నిర్వాహణకు బుధవారం వేలం నిర్వహిస్తున్నట్టు రాజేశ్వర స్వామి ఆలయ కార్య నిర్వాహణ అధికారి బాపిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. వేలంపాటలో పాల్గొనాలనుకునే వారు రూ.20 వేలు డిపాజిట్‌చేసి, ఆలయ ప్రాంగణంలో ఉదయం 11గంటలకు నిర్వహించే వేలంలో పాల్గొనాలని సూచించారు.

# టీపీసీ సభ్యుడికి సన్మానం



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ టౌన్ :** టెలికం అడ్వైజర్ కమిటీ రాష్ట్ర సభ్యుడిగా ఎన్నికైన విశాల్ ఖండ్రే కీ మాజీ ఎంపీపీ మల్లికార్జున్ యాదవ్ ఆధ్వర్యంలో మంగళవారం బీజేపీ నాయకులు ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు మాటూరి జయరాజ్, మండల అధ్యక్షుడు మంగ పెంటయ్య, సీనియర్ నాయకులు ప్రసాద్ గౌడ్, నాయకులు ఈదురువాడ గణేష్, వెంకన్న, శ్రీకాంత్, సిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# పంట దిగుబడి రాక రైతు ఆత్మహత్య



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ :** ఆరుగాలం శ్రమించి పంట పండించినా.. గుబడి రాకపోవడంతో ఓ రైతు పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆసిఫాబాద్ మండలంలో చోటు చేసుకుం. ఆసిఫాబాద్ సిఐ రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆసిఫాబాద్ మండలంలోని బొందగూడ గ్రామానికి చెందిన కొమ్రం పోషయ్య (55) తనకున్న పదేకరాల్లో పత్తి సాగు చేశారు. పత్తి పంట దిగుబడి రాకపోవడంతో నష్టం జరిగిందని ప్రతీ రోజు బాదపడుతూ ఉండేవాడు. దీంతో సోమవారం మధ్యాహ్నం మనస్తాపానికి గురై ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుమందు తాగారు. దీంతో అతని కుటుంబ సభ్యులు గమనించి వెంటనే ఆసిఫాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం మంచిర్యాల ఆసుపత్రికి తరలించారు. అక్కడి చికిత్సా పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు తెలిపారు. మృతుని కుమారుడు నగేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ రవీందర్ తెలిపారు.

# మండల విద్యాశాఖాధికారికి సన్మానం



**ఉద్యమ కెరటం, బెజ్జూర్ :** ఇటీవల ఢిల్లీలో వెల్ ఎడ్యుకేషనల్ అండ్ పీస్ కౌన్సిల్ గౌరవ డాక్టరేట్ అవార్డును అందుకున్న మండల విద్యాధికారి డాక్టర్ చంకోట్ సునీతను మంగళవారం జడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. తెలంగాణ టీచర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు అబ్దుల్ ఖమర్ మాట్లాడుతూ.. ఇంతటి ఉన్నత గౌరవాన్ని "ఆకర్షణీయమైన వ్యక్తిత్వం మరియు సేవాభావం" రంగములో డాక్టరేట్ అవార్డు అందుకున్నారన్నారు. ఇంతటి గొప్ప గౌరవాన్ని పొందినందులకు బెజ్జూర్ మండలానికి, జిల్లాకే వన్నె తెచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఆర్పీ ఏలేశ్వరం శ్రీనివాస్, ఉపాధ్యాయులు పూణేష్, శ్యామ్, సంతోష్, రమేష్ బాబు, ఇందిరా, విష్ణు, ఉపాద్యాయులు పాల్గొన్నారు.

# యాసంగి పంటల డిజిటల్ సర్వే



**ఉద్యమ కెరటం,దహెగాం :** యాసంగి పంటల డిజిటల్ సర్వే రైతులందరూ చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి రామకృష్ణ అన్నారు. మండలంలోని దహెగాం, గిరవెల్లి గ్రామాల్లో జరుగుతున్న యాసంగి పంటల డిజిటల్ సర్వే ను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ యాసంగి సీజన్ లో సాగు చేసే అన్ని రకాల పంటల వివరాలను వ్యవసాయ శాఖ పోర్టల్ లో నమోదు చేసుకునేలా గ్రామాల్లో సర్వే చేసే వ్యవసాయ విస్తరణ అధికారికి అన్ని వివరాలు తెలియజేసి సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు సుష్మిత, వంశీ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# క్వీజ్ పోటీల్లో ట్రినిటి విద్యార్థుల ప్రతిభ



ఉద్యమ కెరటం, మంచిర్యాల: మంచిర్యాల పట్టణంలో ట్రినిటీ పాఠశాలలో ఓ పత్రిక నిర్వహించిన క్వీజ్‌పోటీల్లో అదే పాఠశాలకు చెంన 9వ తరగతి విద్యార్థినులు షణ్ముఖ శర్మ, అనన్య, 8వ తరగతికి చెందిన విద్యార్థిని అశ్లేష ప్రతిభ చాటి బహుమతులు గెల్చుకున్నారు. విద్యార్థులను వారిని పాఠశాల వైస్ ప్రిన్సిపల్ బిజ్జు కురుమిళ్ల అభినంంచారు.

ఉద్యమ కెరటం
నిజం.. రక్షతి రక్షితః
తెలుగు దినపత్రిక
UDYAMA KERATAM TELUGU DAILY
www.udyamakeratam.com



# రైయిలింగ్స్‌తో ప్రమాదాలు తగ్గించొచ్చు



**ఉద్యమ కెరటం, మందమర్రి:** జాతీయ రహదారి రెయిలింగ్స్‌తో ప్రమాదాలు తగ్గించొచ్చని మందమర్రి సీఐ శశిధర్ రెడ్డి తెలిపారు. మందమర్రి పట్టణంలోని యాపల్ ప్రాంతంలో ప్రమాదాల నివారణకు జాతీయ రదహదారి అధికారులతో చర్చించి, మంగళవారం రెయిలింగ్స్ఏర్పాటు చేశారు. రెయిలింగ్స్ మధ్య ఉన్న ఖాళీ స్థలాన్ని పూర్తిగా మూసి వేయించారు. అనంతరం సీఐ మాట్లాడుతూ రోడ్డు ఇరువైపులా రైలింగ్స్ సంధుల్లోంచి ప్రజలు రోడ్డు దాటుతున్న తరుణంలో ప్రమాదాలు జరిగి ఇప్పటికీ నలుగురు మృతి చెందారని, మరికొందరు గాయపడ్డారని, ఈ రైలింగ్స్ మూసివేయడంతో ప్రమాదాలు జరగకుండా నివారించవచ్చని పేర్కొన్నారు. ఆయన వెంట ఎస్సై రాజశేఖర్ ఉన్నారు.

# అంకితభావం, బాధ్యతతోనే గుర్తింపు



**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** ప్రభుత్వ ఉద్యోగులు విధుల పట్ల అంకిత భావం, బాధ్యత చూపిస్తేనే గుర్తింపు దానికదే వస్తుందని మండల వైద్యాకారి ఎండీ సద్దాం అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మండలంలోని ఆయా గ్రామాల ఆశవరకలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. నెలసరి ప్రగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వైద్య సిబ్బం, ఆశ వర్కర్లు, తమ తమ పరిధిలో ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్య సేవలు అంంచటానికి కృషి చేయాలన్నారు. అనంతరం ఇటీవల గణతంత్ర దినోత్సవం పురస్కరించుకొని ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే విడమ బొజ్జు ఐటీడీఏ పిఓ కుష్బూ గుప్తా, చేతుల మీద ప్రశంస పత్రాన్ని అందుకున్న హెచ్ఇఓ పవర్ రవీందర్ ను వైద్యాధికారి సమక్షంలో సత్కరించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ సంతోష్, స్వర్ణలత, మౌనిక ,వాణి, భీమరాజు తదితరులు పాల్గొన్నారు.

# కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు 51 కల్యాణలక్ష్మి, 1 షాదీముబారక్ చెక్కును మంగళవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ఎంఏ కలీం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మహేష్, ఆర్ఐలు నాగరావ్, సాయిరాం, జూనియర్ అసిస్టెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఎన్నికలు సజావుగా జరగాలి



**ఉద్యమ కెరటం, బెల్లంపల్లి:** వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలు సజావుగా జరిగేలా చూడాలని ఎంపీడీవో మహేందర్, ఎంపీవో శ్రీనివాస్‌కోరారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో వివిధ రాజకీయ పార్టీలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి సీపీఐ మండల కార్యదర్శి కామ్రేడ్ బొంతల లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# డిజిటల్ పంట నమోదు



ఉద్యమ కెరటం, నర్సాపూర్(జీ): నిర్మల్ జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అంజి ప్రసాద్ మండల వ్యవసాయ అధికారి రామ్ చందర్ నాయక్ సూచనలతో మండల కేంద్రంలోని నందన్ గ్రామంలో మంగళవారం వ్యవసాయ విస్తరణ అధికారి రమ్య ఆధ్వర్యంలో రైతులు పండించిన పంటలకు సర్వే నెంబర్ ఆధారంగా డిజిటల్ పంట నమోదు చేశారు. పంటలు కచ్చితంగా మార్కెట్లో అమ్ముకోవడానికి డిజిటల్ పంట నమోదు ఉపయోగపడుతుందని రమ్య అవగాహన కల్పించారు.



# నాణ్యమైన విద్యకు చర్యలు

- విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన పంచాయతీ సెక్రెటరీకీ షోకాజ్ నోటీసు జారీ చేయండి
- జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే

**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ రూరల్ :** ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలలో విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ వహిస్తూనే నాణ్యమైన విద్యా బోధన అందించే దిశగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. మంగళవారం జిల్లాలోని ఆసిఫాబాద్ మండలం మాలన్ గొంది గ్రామంలో గల గిరిజన సంక్షేమ ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా సందర్శించి తరగతి గదులు, రిజిస్టర్లు, మధ్యాహ్న భోజనం నాణ్యత, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహించడంతో పాటు నిష్ణాతులైన ఉపాధ్యాయుల ద్వారా విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందించే దిశగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థులకు శుద్ధమైన త్రాగు నీటిని అందించాలని, పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని, విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యా బోధన చేయాలని తెలిపారు. ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ పథకం ద్వారా జిల్లాలో చేపట్టిన పనులను నాణ్యత ప్రమాణాలతో త్వరితగతిన పూర్తి చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం గ్రామ పంచాయతీలో పారిశుద్ధ్య నిర్వహణలో భాగంగా తడి చెత్త, పొడి చెత్త సేకరణ, వర్మి కంపోస్టు తయారీ, నర్సరీల నిర్వహణ విధులలో అలసత్వం, నిర్లక్ష్యం వహించిన పంచాయతీ కార్యదర్శి ప్రసాద్ కు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. పాఠశాలలకు ఉపాధ్యాయులు క్రమం తప్పకుండా హాజరు కావాలని, విధుల పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించాలని తెలిపారు. గ్రామపంచాయతీ పరిధిలో ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తాగునీరు, మురుగు కాలువలు, కనీస వసతులు కల్పించే విధంగా అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు పూర్తిస్థాయిలో సదుపాయాలు

## అదనపు కలెక్టర్ దీపక్ తివారి



ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ (వాంకిడి) : ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థుల సౌకర్యార్థం పూర్తి స్థాయిలో సదుపాయాలు కల్పించడం జరుగుతుందని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి అన్నారు. మంగళవారం జిల్లాలోని వాంకిడి మండల కేంద్రంలో గల కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో అదనపు తరగతి గదుల నిర్మాణం కొరకు తహసిల్దార్ రియాజ్ అలీ, మండల పరిషత్ అభివృద్ధి అధికారి ప్రవీణ్ కుమార్, మండల విద్యాధికారి శివ చరణ్ కుమార్ లతో కలిసి పాఠశాల ఆవరణలో స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం అన్ని ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలలో విద్యార్థుల సౌకర్యార్థం పూర్తి స్థాయిలో సదుపాయాలు కల్పించడంతో పాటు నాణ్యమైన విద్య బోధన అందించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఇందులో భాగంగా పాఠశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. విద్యార్థులకు ఆట స్థలం సదుపాయం కల్పిస్తూనే సరైన స్థలంలో అదనపు గదుల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం ఇందాని గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సందర్శించి మధ్యాహ్న భోజనం నాణ్యత, అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి పనులు, రిజిస్టర్లు, తరగతిగదులను పరిశీలించారు. విద్యార్థుల సంక్షేమం దృష్ట్యా ప్రభుత్వం డైట్ చార్జీలను 40 శాతం పెంచడం జరిగిందని, నూతన మెనూ ప్రకారం సకాలంలో పోషక విలువలు కలిగిన ఆహారాన్ని విద్యార్థులకు అందించాలని, వారి ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పించడం జరుగుతుందని, ఈ గ్రామంలో పాఠశాలలు చేపట్టిన పనులను వేగవంతం చేయాలని తెలిపారు. 10 వ తరగతి వార్షిక పరీక్షలు సమీపిస్తున్నందున విద్యార్థుల కొరకు ప్రత్యేక కార్యచరణ రూపొందించాలని, ఆ ప్రకారంగా విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేయాలని, 100 శాతం ఉత్తీర్ణత సాధించే దిశగా కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రత్యేక అధికారి మీనా, పంచాయతీ కార్యదర్శి శివకుమార్, ఎ. ఈ. కిరణ్ సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల సంక్షేమంపై నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

## ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ :** విద్యార్థుల సంక్షేమంపై నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా హెచ్చరించారు. మంగళవారం జిల్లాలోని గిరిజన సంక్షేమ ప్రాథమిక పాఠశాలలో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన పథకం, విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు అంశాలపై వివరాలు తెలుసుకునేందుకు దాదాపు 40 పాఠశాలల ఉపాధ్యాయులకు వీడియో కాల్ చేశారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు అధికారి మాట్లాడుతూ విద్యార్థుల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతుందని, విద్యారంగ అభివృద్ధిలో భాగంగా అన్ని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు పూర్తి స్థాయి మౌలిక సదుపాయాలు కల్పించడం కొరకు ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. నూతన మెనూ ప్రకారం పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించడంతో పాటు నాణ్యమైన విద్యా బోధన దిశగా చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఈ నేపథ్యంలో ఉపాధ్యాయులు అంకితభావంతో పని చేస్తూ ప్రతి విద్యార్థికి మంచి భవిష్యత్తు అందించే దిశగా తమ వంతు బాధ్యత నిర్వర్తించాలని తెలిపారు. ఈ క్రమంలో జిల్లాలోని మొగడ్ దగడ్ స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని గురుడిపేట గిరిజన సంక్షేమ పాఠశాలలో పనిచేస్తున్న సీఆర్టీ శారద గైర్హాజరు కాగా, ఎస్ఈఆర్పీ పోచం, హెచ్ఎం అశోక్ ను వివరణ కోరగా ఎలాంటి సమాచారం లేకుండా విధులకు గైర్హాజరు అయ్యారని తెలిపారు. దీంతో లపడంతో సదరు సీఆర్టీని తొలగించాలని ఆదేశించారు.



# అఖిలపక్షం నాయకులతో సమావేశం

**ఉద్యమ కెరటం, బెజ్జూర్ :** మండల అభివృద్ధి కార్యాలయంలో మంగళవారం అఖిలపక్ష సమావేశం నిర్వహించినట్లు ఎంపీడీవో గౌరీ శంకర్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని గ్రామపంచాయతీల ఓటరు జాబితా సవరణ వార్డు సభ్యుల వారీగా ఓటర్ లిస్ట్ ప్రచురణ అంశాలపై అఖిలపక్ష సమావేశం నిర్వహించారన్నారు. సమావేశానికి హాజరైన సభ్యులకు మండలంలోని 22 గ్రామపంచాయతీల ఓటర్ జాబితాలో అందించడం జరిగిందన్నారు. వార్డుల వారీగా 22 గ్రామపంచాయతీల్లో ఓటర్ల వివరాలు అన్ని రాజకీయ పార్టీల నాయకులకు చూపించడం జరిగిందని తెలిపారు. అందరి అభిప్రాయాలను సేకరించి ఉన్నతాధికారులకు నివేదించడం జరుగుతుందని అన్నారు. మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఆత్రం రాజారాం, మాజీ ఎంపీటీసీ లంగారి శ్రీనివాస్, మాజీ పిఎసిఎస్ వైస్ చైర్మన్ దందేర ఇస్తారి, కాంగ్రెస్ నాయకులు అబ్దుల్ హాకీం, బిజెపి నాయకులు బెన్కి శ్యాంసుందర్, మాజీ ఉపసర్పంచ్ సులుగుపల్లి సంతోష్, టిఆర్ఎస్ నాయకులు భూస సారయ్య, కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# చట్టాలపై విద్యార్థులకు అవగాహన



**ఉద్యమ కెరటం, కాగజ్ నగర్ :** కాగజ్ నగర్ డివిజన్ పరిధిలోని భట్‌పల్లి జడ్పీఎస్ఎస్ స్కూల్‌లో కాగజ్ నగర్ డివిజన్ షీటీం ఆధ్వర్యంలో మంగళవారం చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా షీటీం సభ్యులు రమాదేవి, సునిత మాట్లాడుతూ మహిళలపై హింస, ఈవ్‌టీజింగ్, సైబర్ క్రైంలకు ఎవరైనా గురి అయినట్లయితే వెంటనే షీటీంను సంప్రదించాలని సూచించారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి వివరించారు. జిల్లాలోని మహిళలకు రక్షణ కల్పించడం కోసమే షీ టీంలు పనిచేస్తున్నాయని, సైబర్ క్రైమ్ 1930 కు డయల్ చేయాలని, ఏదైనా అత్యవసర సమయంలో డయల్ 100కు కాల్ చేయాలని పేర్కొన్నారు. షీటీం కాగజ్ నగర్ ఫోన్ నంబర్ 8712670565 కు సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ హెచ్ఎం అనురాధ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉద్యమ కెరటం
www.udyamakeratam.com
తెలుగు దినపత్రిక
UDYAMA KERATAM TELUGU DAILY
బుధవారం
5 ఫిబ్రవరి 2025




# ఆ ఘనత విద్యా భారతిదే

## ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం




**ఉద్యమ కెరటం, తాండూర్:** తాండూర్ మండలంలోని విద్యార్థులకు కార్పొరేట్ స్థాయిలో విద్యను అందించిన ఘనత విద్యా భారతి పాఠశాలకే దక్కిందని ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. సోమవారం రాత్రి విద్యా భారతి పాఠశాల సిల్వర్ జూబ్లీ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. ఎక్కడో పుట్టి పెరిగి ఉద్యోగ రీత్యా తాండూర్ మండలానికి వచ్చి సింగరేణి సంస్థలో పనిచేసే కార్మికుడు ఒక విద్యా వ్యవస్థను ఏర్పాటు చేసి ఎంతోమంది విద్యార్థులను ఆదర్శవంతులుగా తీర్చిదిద్ది విద్యా భారతి పాఠశాల సిల్వర్ జూబ్లీ సిల్వర్ జూబ్లీ వేడుకలు చేసుకోవడం హర్షించదగ్గ విషయం అన్నారు. రానున్న రోజుల్లో విద్యా భారతి పాఠశాల విద్యార్థులు ఉన్నత శిఖరాలకు అధిరోహించి పాఠశాలకు పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలన్నారు. తెలంగాణ ఉద్యమంలో పాఠశాల వ్యవస్థాపకులు సురభి ఆగమ రావు తన వెంట ఉండి, తెలంగాణ ఉద్యమంలో తనకు ఎంతగానో సహకరించారన్నారు. ఇదే కార్యక్రమంలో పాల్గొన్న మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఇంత చక్కటి విద్య వేదికగా సిల్వర్ జూబ్లీ వేడుకలకు తనను అతిథిగా ఆహ్వానించడం సంతోషంగా ఉందన్నారు. పాఠశాల వ్యవస్థాపకులు సురభి ఆగమ రావు మాట్లాడుతూ ఒక విద్యా వ్యవస్థను ఏర్పాటు చేసి 25 సంవత్సరాలుగా తనకు సహకరించిన మండల వాసులకు పాఠశాల తరఫున ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు, అటెండర్లకు,డ్రైవర్లకు,వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అతిథులకు, పోషకులకు శాలువా మెమెంటోలతో సన్మానించారు. వేడుకల సందర్భంగా పాఠశాల విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అతిథులను ఎంతగానో అలరించాయి. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ తాండూర్ మండల సీనియర్ నాయకులు ఎస్ మహేందర్ రావు, మాజీ జడ్పీటీసీ ఎస్ బానయ్యతోపాటు మండలంలోని వివిధ పార్టీల నాయకులు, గోలేటి ఏరియా జీఎం ఎం శ్రీనివాస్, జిల్లాలోని ప్రైవేట్ విద్యాసంస్థల డైరెక్టర్లు, అధికారులు, పాఠశాల విద్యార్థులు,తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# వాహనాలను ఆపొద్దు

- అటవీ శాఖ చెక్ పోస్టుల వద్ద రాత్రి రాకపోకలకు గ్రీన్ సిగ్నల్
- అడ్డుకోవద్దని పీసీసీఎఫ్‌కు మంత్రి కొండా సురేఖ ఆదేశం





VEDMA BHOJJU
Khanapur - 006 (ST) Constituency

Lr.No.03/W.A/Khanapur/2025, dt:07.01.2025.

To
Smt Konda Surekha Garu,
Hon'ble Minister for Environment & Forest, Endowment
Government of Telangana,
Dr.B.R.Ambedkar, Secretariat,
Hyderabad.

Respected Madam,

Sub:- Forest Department - Wildlife check post (Environmental Fee Collection) Closure from 9:00 PM to 6:00 AM in view of protection of wildlife - Instruction reiterated request for cancel snack order - Requested - Reg.

Ref:- CF, FDPT KTR, Mancherial RC.No.514/2016/A2, dt:03.01.2025.

I would like to bring to your kind notice that through the subject of reference cited, the Conservator of Forest & FDPT KTR, Mancherial has issued the instruction to close the Check post (environmental Fee Collection) has to be closed by 9:00 PM to 6:00 AM daily in which check posts are located in Adilabad, Nirmal and Mancherial Districts of Kawal Reserve Forest.

Further, it is submitted that these orders would be convenient to the above-mentioned Three Districts local people and these orders should be barrier to the public and emergency situations.

Therefore, I request you to kindly cancel the instructions memo which is issued vide reference cited by the Conservator of Forest & FDPT KTR, Mancherial.

Thanking you madam,

Yours sincerely,
(VEDMA BHOJJU)

Copy to the CF, FDPT KTR, Mancherial.

**ఉద్యమ కెరటం, నిర్మల్ :** కవ్వాల అభయారణ్యం పరిధిలోని అటవీ శాఖ చెక్ పోస్టుల వద్ద రాత్రి తొమ్మిది గంటల నుంచి తెల్లవారు ఆరు గంటల వరకు వాహనాల రాకపోకలను అడ్డుకొంటున్న అటవీ అధికారుల చర్యలకు రాష్ట్ర అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ అడ్డుకట్ట వేశారు. రాత్రి వేళల్లో వాహనాల రాకపోకలను అడ్డుకోవద్దని సంబంధిత జిల్లాల అటవీ అధికారుకారులకు సూచనలు జారీ చేయాలని రాష్ట్ర ప్రిన్సిపల్ చీఫ్ కంజర్వేటర్ ను ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్ లో మంత్రి కొండా సురేఖను ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ కలిసి రాత్రి వేళల్లో అటవీ చెక్ పోస్టుల వద్ద ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించి, ఎఫ్‌డీపీటీ జారీ చేసిన ఉత్తర్వులను రద్దు చేయాలని వినతి పత్రం అందజేశారు. ఎమ్మెల్యే ప్రాతినిధ్యంపై స్పందించిన మంత్రి ప్రజలకు అసౌకర్యం కలుగకుండా చర్యలు తీసుకోవాలని, రాత్రి వేళల్లో వాహనాల రాకపోకలకు అనుమతించాలని పీసీసీఎఫ్‌కు ఆదేశించారు.



# కన్నుల పండువగా బాలేశ్వర స్వామి రథోత్సవం

**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ :** జిల్లా కేంద్రంలోని ఉత్తరా వాహిని నది తీరాన వెలసిన స్వయంభూ బాలేశ్వర స్వామి రథోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం ఆలయ ప్రధాన అర్చకులు శ్రీధర్ శర్మ, అజయ్ శర్మ ఆధ్వర్యంలో నిత్య పూజలతోపాటు అభిషేకం, మంగళహారతి, మహా మంత్ర పుష్పాలతో ప్రత్యేక పూజలు చేశారు. రథసప్తమిని పురస్కరించుకొని బాలేశ్వర స్వామిని న్యాయమూర్తి అనంతలక్ష్మి దంపతులు, ఎస్పీ డీవీ శ్రీనివాసరావు, ఏఎస్పీ చిత్తరంజన్, దేవదాయ శాఖ ఈఓ వేణుగోపాల్ గుప్త దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. జిల్లా కేంద్రమే కాక పక్కన ఉన్న మహారాష్ట్ర నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. సాయంత్రం స్వామివారి ఉత్సవ మూర్తులను అలంకరించి భాజా భజా బజంత్రిలతో రథయాత్ర నిర్వహించారు.





### వలంటరీలకు దుస్తుల పంపిణీ

శ్రీ బాలేశ్వర సేవా పరిషత్, నవజ్యోతి సాంస్కృతిక సంస్థల ఆధ్వర్యంలో రథోత్సవ వాలంటీర్ల కు కాషాయ సాంప్రదాయ వస్త్రాలను, భక్తులకు మంచినీటి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐ బుద్దే రవీందర్, బాలేశ్వర శసేవా పరిషత్, నవజ్యోతి సంస్థల ప్రముఖులు నాగబాల సురేష్ కుమార్, ధర్మపురి వెంకటేశ్వర్లు, రాధాకృష్ణ చారి తదితరులు పాల్గొన్నారు.

## మాతా శిశు మరణాలు తగ్గించాలి



**ఉద్యమ కెరటం, బెజ్జూర్ :** మండల కేంద్రంలోని సామాజిక ఆసుపత్రిలో మంగళవారం మాతా శిశు మరణాలపై ఏఎన్ఎంలు ఆశా వర్కర్లతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పీహెచ్ఎన్ కమల మాట్లాడుతూ మాతా, శిశు మరణాలను తగ్గించాలని ఏఎన్ఎంలు, ఆశాలకు సూచించారు. గర్భిణుల ఆరోగ్య దృష్ట్యా, రక్తహీనత సమస్య లేకుండా అవసరమైన మందులను అందించాలన్నారు. గర్భిణీల ఆరోగ్య వివరాలపై పూర్తి అవగాహన ఉండాలన్నారు. ప్రతి ఒక్క గర్భిణి ప్రభుత్వ ఆసుపత్రిలోనే వైద్య పరీక్షలు నిర్వహించేలా చూడాలని, అక్కడే ప్రసవమయ్యేలా ఆశా కార్యకర్తలు పని చేయాలని అన్నారు. అనంతరం లెప్రాసిపై ఆశా కార్యకర్తలకు అవగాహన కల్పించారు. ప్రతి గ్రామంలో అన్ని మందులు అందుబాటులో ఉంచాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్ హెచ్ పీ గణేష్, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## నాటుసారా స్థావరాలపై దాడులు



**ఉద్యమ కెరటం, కాగజ్ నగర్ :** చింతలమానేపల్లి మండలంలోని లంబడిహెట్టి, రణవెల్లి, చింతలమానేపల్లి, డిమ్డా, గూడెం గ్రామాల్లో నిర్వహిస్తున్న నాటుసారా స్థావరాలపై ఆదిలాబాద్ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌సీఐ అక్బర్ హుస్సేన్, ఎస్సైలు ఐ సురేష్, పీ రాజేశ్వర్, సిబ్బంది దాడులు చేశారు. 20 లీటర్ల నాటుసారా ధ్వంసం చేసి, 40 దేశీదారు బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. ఐదుగురిని అదుపులోకి తీసుకొని, చింతలమానేపల్లి తహసీల్దార్ మునావర్ షరీఫ్ ఎదుట బైండోవర్ చేసినట్టు ఆబ్కారీ సీఐ వీ రావి తెలిపారు.

## పాడె మోసిన మాజీ ఎమ్మెల్యే




**ఉద్యమ కెరటం, బెజ్జూర్:** మండలంలోని కుక్కుట గ్రామానికి చెందిన పెద్దల కైలాస్ అనారోగ్యంతో సోమవారం మృతి చెందగా, మంగళవారం నిర్వహించిన అంతిమ యాత్రలో మాజీ ఎమ్మెల్యే కోనప్ప పాల్గొని, పాడె మోశారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు సీడం సకారం, డోకి వెంకన్న, బషరత్ ఖాన్, సద్మిక పురుషోత్తం, రహమత్, ఉమర లింగయ్య, తెలంగాణ జావిద్, మెరుగు రమేష్ తదితరులు ఉన్నారు.

## బీజేపీ జిల్లా అధ్యక్షుడికి సన్మానం

**ఉద్యమ కెరటం, కాగజ్ నగర్ :** బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన ధోని శ్రీశైలం ముదిరాజ్ ను మంగళవారం కాగజ్‌నగర్‌లోని ఎమ్మెల్యే నివాసంలో బీజేపీ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు కృష్ణ కుమారి, ఆసిఫాబాద్ నియోజకవర్గం అసెంబ్లీ కన్వీనర్ సొల్లు లక్ష్మీ, తిర్యాణి మాజీ మండల అధ్యక్షుడు, ఎమ్మెల్సీ ఎన్నికల మండల కన్వీనర్ పులి వెంకటేష్, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి ఆత్రం గోపాల్, బూత్ అధ్యక్షులు మంగా రాజేష్, పితంబర్, సంతోష్ పాల్గొన్నారు.

## బాసర ఆలయంలో ఎమ్మెల్యే పూజలు


ఉద్యమ కెరటం, ఉట్నూర్: నిర్మల్ జిల్లా బాసర సరస్వతి అమ్మవారిని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ తో పాటు మాజీ ఎమ్మెల్యేలు ఆత్రం సక్కు, విఠల్ రెడ్డి దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భైంసా మార్కెట్ కమిటీ చైర్మన్ , స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ఉద్యమ కెరటం
నిజం.. రక్షతి రక్షితః
తెలుగు దినపత్రిక
UDYAMA KERATAM TELUGU DAILY
www.udyamakeratam.com



# సినిమా






## ఓటీటీలోకి 'గేమ్ ఛేంజర్'..

రామ్ చరణ్ హీరోగా శంకర్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'గేమ్ ఛేంజర్'. సంక్రాంతి కానుకగా విడుదలైన ఈ సినిమా ఇప్పుడు ఓటీటీ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమైంది. అమెజాన్ ప్రైమ్ వేదికగా ఫిబ్రవరి 7 నుంచి అందుబాటులోకి రానుంది. తెలుగు, తమిళ, కన్నడ భాషల్లో ఇది స్ట్రీమింగ్ కానుంది. రామ్‌చరణ్ సరసన కియారా అద్వాణీ నటించిన ఈ చిత్రంలో పాటలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచి భారీ వ్యూస్‌ను సొంతం చేసుకున్నాయి.

## పెళ్లి పీటలెక్కనున్న పార్వతి నాయర్

మలయాళ ప్రముఖ హీరోయిన్ పార్వతి నాయర్ త్వరలోనే పెళ్లిపీటలెక్కనుంది. ఓ వ్యాపార వేత్తతో కలిసి ఆమె ఏడడుగులు నడవనుంది. చెన్నైకి చెందిన వ్యాపారవేత్త ఆశ్రిత్ అశోక్ తో ప్రేమలో ఉన్న ఆమె త్వరలోనే ఏడడుగులు వేస్తున్నట్లు అధికారికంగా ప్రకటించింది. అంతేకాదు తమ నిశ్చితార్థం జరిగినట్లు సోషల్ మీడియాలో ఫొటోలను కూడా షేర్ చేసింది. దీంతో కొద్ది క్షణాల్లోనే ఈ ఫొటోలు వైరల్ గా మారాయి. కుటుంబ సభ్యులతో పాటు పలువురు సినీ ప్రముఖులు, అభిమానులు, నెటిజన్లు పార్వతి నాయర్- అశోక్ లకు అభినందనలు, శుభాకాంక్షలు తెలుపుతున్నారు. 'మైసూర్ శాండల్' సోప్ బ్రాండ్ అంబాసిడర్‌గా పార్వతి నాయర్ పేరు మార్మోగిపోయింది. ఇప్పటి వరకు సుమారు 30కి పైగా చిత్రాల్లో నటించిందీ అందాల తార. తెలుగులో న్యాచురల్ స్టార్ నాని నటించిన జెండాపై కపిరాజు సినిమాలో పార్వతి నాయర్ పాత్రలో మెప్పించింది. గతేడాది విజయ్ నటించిన ది గోట్ చిత్రంలోనూ ఓ కీలక పాత్రలో మెరిసిందీ అందాల తార.



## రెండు సినిమాల నటనతోనే యమ క్రేజీ

ప్రస్తుతం ఈ క్రేజీ హీరోయిన్ పేరు టాలీవుడ్‌లో బాగా వినిపిస్తోంది. అలాగనీ ఈ ముద్దుగుమ్మ పెద్దగా సినిమాల్లో నటించలేదు. ఇప్పటివరకు కేవలం రెండంటే రెండు సినిమాల్లో హీరోయిన్ గా యాక్ట్ చేసింది. అందులో ఒకటి యావరేజ్ కాగా మరొకటి పాన్ ఇండియా బ్లాక్ బస్టర్ మూవీ. దీంతో ఈ అమ్మడికి సినిమా అవకాశాలు వెల్లువెత్తుతున్నాయి. తాజాగా మరో తెలుగు సినిమాలో ఈ అందాల తారకు అవకాశం దక్కించి. క సినిమాతో బ్లాక్ బస్టర్ కొట్టిన కిరణ్ అబ్బవరం నటిస్తున్న తాజా చిత్రం కే ర్యాంప్ లో ఈ ముద్దుగుమ్మకు కథానాయికగా అవకాశం లభించింది. దీంతో ఈ బ్యూటీ ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. ప్రస్తుతం టాలీవుడ్ లో క్రేజీ హీరోయిన్లలో ఒకరిగా గుర్తింపు తెచ్చుకుంటోన్న ఆమె మరెవరో కాదు యుక్తి తరేజా. నాగ శౌర్య నటించిన రంగబలి మూవీతో తెలుగు సినిమాకు పరిచయమైన ఈ ముద్దుగుమ్మ మార్కో సినిమాతో పాన్ ఇండియా ఫేమస్ అయ్యింది. సోషల్ మీడియాలోనూ ఈ ముద్దుగుమ్మకు ఓ రేంజ్ లో ఫాలోయింగ్ ఉంది. తను షేర్ చేసే గ్లామర్ ఫొటోస్, వీడియోలకు నెటిజన్ల నుంచి మంచి స్పందన వస్తుంటుంది.

## భారీ బడ్జెట్ కారణంగానే తెరకెక్కించలేకపోతున్నా

### 'క్రిష్-4'పై దర్శకుడు కామెంట్స్




హృతిక్ రోషన్ హీరోగా తెరకెక్కిన 'క్రిష్' సిరీస్ సినిమాలు మంచి ప్రేక్షకాదరణతో బాక్సాఫీస్ వద్ద వసూళ్ల వర్షం కురిపించాయి. ఇప్పటికే విడుదలైన మూడు భాగాలు భారీ విజయాన్ని అందుకోగా నాలుగో భాగం కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అయితే దీని ఆలస్యానికి కారణాన్ని తాజాగా దర్శకుడు రాకేష్ రోషన్ వెల్లడించారు. ఆర్థిక ఇబ్బందుల వల్ల ఈ చిత్రాన్ని 12 ఏళ్ల నుంచి తెరకెక్కించలేకపోతున్నట్లు చెప్పారు. 'క్రిష్-4' కోసం ప్రేక్షకులు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్నారు. కానీ, మేము ఎంత ప్రయత్నించినా బడ్జెట్ సమకూరడం లేదు. అందుకే ఇది ఆలస్యమవుతోంది. నాలుగో భాగాన్ని మరింత గ్రాండ్‌గా తీయాలి. ఒకవేళ నేను బడ్జెట్ తగ్గించాలని చూస్తే.. ఈ చిత్రం ఓ సాధారణ కథలా అయిపోతుంది. అంతేకాదు.. ప్రస్తుతం ప్రపంచం చాలా చిన్నదిగా మారిపోయింది. అరచేతిలో ఉండే సెల్‌ఫోన్‌లో మొత్తం తెలిసిపోతోంది. ఈ రోజుల్లో పిల్లలు కూడా ఎంతోమంది సూపర్‌హీరోల చిత్రాలను చూస్తున్నారు. అలాంటప్పుడు మనం చిన్న తప్పు చేసినా వారి నుంచి విమర్శలు ఎదుర్కోవాల్సి ఉంటుంది. అందుకే మరింత జాగ్రత్తగా దీన్ని తీయాలి. హాలీవుడ్‌లో సూపర్ హీరో డ్రామాలు భారీ బడ్జెట్‌తో రూపొందిస్తారు. అది మనకు సాధ్యం కాదు. అంత ఖర్చులు భరించలేం. వారు రూ.1000తో సినిమా తీస్తే.. మనం అదే సినిమాను రూ.4కు తీయాలి. నిర్మాతలు బడ్జెట్‌పై కాకుండా మంచి కథలపై దృష్టి పెట్టాలి" అని దర్శకుడు రాకేష్ రోషన్ చెప్పారు. ఇక క్రిష్ సిరీస్ చిత్రాలు వరుసగా 2003, 2006, 2013 సంవత్సరాల్లో విడుదలైన విషయం తెలిసిందే.



## ఐటెం సాంగ్‌లో శ్రియ

యంగ్ హీరోల దగ్గర నుంచి సీనియర్ హీరోల వరకు అందరి సరసన సినిమాలు చేసి ప్రేక్షకులను ఆకట్టుకుంది వయ్యారి భామ శ్రియ. ఈ ముద్దుగుమ్మ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఒకప్పుడు స్టార్ హీరోయిన్ గా రాణించింది ఈ ముద్దుగుమ్మ. తెలుగులో స్టార్ హీరోలు కూడా ఈ అమ్మడి డేట్స్ కోసం ఎదురుచూసేవారు అప్పట్లో అంత బిజీగా గడిపింది శ్రియ. తెలుగులోనే కాదు తమిళ్ లోనూ సినిమాలు చేసి మెప్పించింది. నటనతో పాటు అందంలోనూ ఈ అమ్మడు అదరగొట్టింది. ఇక ఇప్పుడు నాలుగు పదుల వయసులోనూ శ్రియ తన అందాలతో ఆకట్టుకుంటుంది. ప్రస్తుతం శ్రియ సినిమాలకు గ్యాప్ ఇచ్చింది. అడపదడపా సినిమాల్లో నటిస్తుంది. ఇదిలా ఉంటే ఇప్పుడు మరోసారి శ్రియ స్పెషల్ సాంగ్ లో కనిపించనుంది. ఓ స్టార్ హీరో సినిమాలో ఐటెం సాంగ్ లో శ్రియ నటిస్తుందని తెలుస్తుంది. ఆ హీరో ఎవరో కాదు తమిళ్ టాప్ హీరో సూర్య. మే నెలలో ఈ సినిమాను విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.

## వరుస సినిమాలతో ప్రభాస్ బిజీ



రెబల్ స్టార్ ప్రభాస్ ప్రస్తుతం బ్యాక్ టు బ్యాక్ సినిమాలను లైనప్ చేసి బిజీగా ఉన్నాడు. రీసెంట్ డేస్ లో వరుస హిట్స్ తో దూసుకుపోతున్నాడు. దాదాపు ఆరేళ్ళ తర్వాత సలార్ సినిమాతో సూపర్ హిట్ ఆ అందుకున్నాడు ప్రభాస్. ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో వచ్చిన ఈ సినిమా బ్లాక్ బస్టర్ గా నిలిచింది. ఈ సినిమా యాక్షన్ ఎంటర్టైనర్ గా తెరకెక్కింది. ఈ సినిమాలో మరో హీరోగా మలయాళ నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్ నటించాడు. ఈ సినిమా తర్వాత ప్రభాస్ కల్కి సినిమాతో మరో హిట్ అందుకున్నాడు. నాగ్ అశ్విన్ దర్శకత్వంలో తెరకెక్కిన కల్కి సినిమా ఏకంగా వెయ్యికోట్లకు పైగా వసూల్ చేసింది. ఇక ఇప్పుడు బ్యాక్ టు బ్యాక్ సినిమాలు లైనప్ చేశారు. ఇక ప్రభాస్ లైనప్ చేసిన సినిమాల్లో సలార్ 2, కల్కి 2, రాజా సాబ్, ఫౌజీ, స్పిరిట్ సినిమాలను లైనప్ చేశారు. ఇదిలా ఉంటే ప్రభాస్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. సెలబ్రెటీలందరూ ప్రభాస్ ను తెగ పొగిడేస్తుంటారు. ప్రభాస్ మంచితనం గురించి.. ప్రభాస్ పంపించే ఫుడ్ గురించి ఎప్పుడు మాట్లాడుతూ ఉంటారు. తాజాగా నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్ ప్రభాస్ గురించి ఆసక్తికర కామెంట్స్ చేశారు. పృథ్వీరాజ్ సుకుమారన్ మాట్లాడుతూ ప్రభాస్ పై ప్రశంసలు కురిపించారు. అలాగే పృథ్వీరాజ్ సుకుమారన్ మాట్లాడుతూ.. ప్రభాస్ చాలా మంచి వ్యక్తి. అతనికి చిన్న చిన్న ఆనందాలు ఎక్కువ ఇష్టం. స్టార్ డమ్ గురించి అస్సలు పట్టించుకోడు. సోషల్ మీడియాకు చాలా దూరంగా ఉంటాడు. ఇన్ స్టా గ్రామ్ లో ప్రభాస్ అకౌంట్ నుంచి షేర్ అయ్యే పోస్ట్ లు కూడా ప్రభాస్ షేర్ చేసేవి కాదు. ఈ మాట చెప్పి మీ అందరినీ నిరాశ పరిచినందుకు క్షమించండి అని అన్నారు పృథ్వీరాజ్.

ఉద్యమ కెరటం
www.udyamakeratam.com
నిజం.. రక్షతి రక్షితః
తెలుగు దినపత్రిక
UDYAMA KERATAM TELUGU DAILY



## విరాట్ వికెట్.. బస్సు డ్రైవర్
# సలహా విని షాకయ్యా..!

### హిమాన్షు సంఘ్వాన్



పేలవ ఫామ్‌తో ఇబ్బందిపడుతున్న విరాట్ కోహ్లీ మునపటి జోరు అందుకోవడానికి దాదాపు 12 ఏళ్ల తర్వాత రంజీ మ్యాచ్ ఆడాడు. రైల్వేస్‌తో జరిగిన మ్యాచ్‌లో దిల్లీ జట్టు ఇన్నింగ్స్ తేడాతో ఘన విజయం సాధించింది. కానీ, ఒకేఒక్క ఇన్నింగ్స్ ఆడిన కోహ్లీ మాత్రం ఆరు పరుగులకే పెవిలియన్‌కు చేరాడు. రైల్వేస్ బౌలర్ హిమాన్షు సంఘ్వాన్ బౌలింగ్‌లో క్లీన్‌బౌల్డ్ అయ్యాడు. కోహ్లీ వికెట్ తీయడంతో హిమాన్షు సంఘ్వాన్ వార్తల్లో నిలిచాడు. అయితే, విరాట్ వికెట్ ఎలా తీయాలో తమ జట్టు బస్సు డ్రైవర్ తనకు సూచనలు చేశాడని హిమాన్షు పేర్కొన్నాడు. 5వ స్టంప్‌లైన్‌లో బౌలింగ్ చేయాలని సూచించినట్లు తెలిపాడు. బస్సు డ్రైవర్ సూచనలకు తాను షాకయ్యానని.. కోహ్లీ బలహీనతలపైనే కాకుండా తన బలాలపై దృష్టిపెట్టి బౌలింగ్ చేసినట్లు హిమాన్షు వివరించాడు. కోహ్లీ కొంతకాలంగా ఆఫ్‌సైడ్ ఆవల పడిన బంతులను ఆడటంలో ఇబ్బంది పడుతున్నాడనే విషయం తెలిసిందే. 'మ్యాచ్‌కు ముందు దిల్లీ జట్టులో విరాట్ కోహ్లీ, రిషభ్ పంత్ ఆడుతున్నారని చెప్పారు. కానీ, పంత్ ఆడలేదు. మ్యాచ్ ప్రత్యక్ష ప్రసారం అవుతుందని ఆ సమయంలో మాకు తెలియదు. తర్వాత ఆ విషయం తెలిసింది. రైల్వేస్ పేస్ విభాగాన్ని నేను ముందుండి నడిపిస్తున్నా. క్రమశిక్షణతో బౌలింగ్ చేయాలని కోచ్‌లు సూచించారు. నేనే కోహ్లీ వికెట్ తీస్తానని జట్టులోని ప్రతిఒక్కరూ చెప్పారు. బస్సు డ్రైవర్ కూడా కోహ్లీకి నాలుగు లేదా ఐదో స్టంప్ లైన్‌లో బౌలింగ్ చేయాలని సూచించాడు. కానీ, నాపై నాకు నమ్మకం ఉంది. అవతలి వాళ్ల బలహీనత లపై కాకుండా నా బలంపై దృష్టి పెట్టాలను కున్నా. అలాగే బౌలింగ్ చేసి కోహ్లీని ఔట్ చేశా' అని సంఘ్వాన్ వివరించాడు.

### ప్రత్యేకంగా ప్లాన్ చేయలేదు

'విరాట్ కోహ్లీని ఔట్ చేయడానికి ప్రత్యేకంగా ప్లాన్ చేయలేదు. మా ఇన్నింగ్స్ ముగిసిన తర్వాత డ్రెస్సింగ్ రూమ్‌కు వెళ్తున్నప్పుడు కోహ్లీతో కలిసి చేతులు కలిపి మాట్లాడాను. బాగా బౌలింగ్ చేశావని కోహ్లీ అభినందించాడు. లంచ్ బ్రేక్‌లో ఫొటో దిగుతానని చెప్పాను. కోహ్లీని ఔట్ చేసిన బంతి తీసుకొని దిల్లీ డ్రెస్సింగ్ రూమ్‌కి వెళ్లి అతడితో కలిసి ఫొటో దిగాను' అని హిమాన్షు తెలిపాడు.



టీమ్‌ఇండియా యువ బ్యాటర్ అభిషేక్ శర్మపై మాజీ స్పిన్నర్ హర్భజన్ సింగ్ ప్రశంసలు కురిపించాడు. అభిషేక్‌ను త్వరలో టెస్టుల్లో చూస్తామని, అతడి రూపంలో టీమ్‌ఇండియాకు మరో వీరేంద్ర సెహ్వాగ్ దొరికాడని భజ్జీ పేర్కొన్నాడు. ఇంగ్లాండ్‌తో జరిగిన ఐదో టీ20లో అభిషేక్ (135బీ 54 బంతుల్లో 7 ఫోర్లు, 13 సిక్స్‌లు) సంచలన ఇన్నింగ్స్‌తో వీరవిహారం చేశాడు. ఎడాపెడా సిక్స్‌లు బాదుతూ 17 బంతుల్లో హాఫ్ సెంచరీ, 35 బంతుల్లోనే మూడంకెల స్కోరు అందుకున్నాడు. ఈ క్రమంలోనే టీ20ల్లో భారత తరఫున అత్యధిక సిక్స్‌లు, అత్యధిక వ్యక్తిగత స్కోరు చేసిన ఆటగాడిగా రికార్డు సృష్టించాడు. ఈ నేపథ్యంలో పంజాబ్ బ్యాటర్‌పై ప్రశంసలు వర్షం కురుస్తోంది. 'అభిషేక్ శర్మను త్వరలో మనం టెస్టు జట్టులోనూ చూస్తాం. అతను టెస్టుల్లో కూడా దూకుడుగా ఆడగలడు. రంజీ ట్రోఫీలో పంజాబ్‌కు కెప్టెన్‌గా ఉన్నాడు. అభిషేక్ తనదైన రోజున చెలరేగి ఆడి మ్యాచ్ గమనాన్నే మార్చేస్తాడు. గతంలో వీరేంద్ర సెహ్వాగ్, వివ్ రిచర్డ్స్..

## మరో వీరేంద్ర సెహ్వాగ్
# దొరికాడు..

### అభిషేక్ శర్మపై హర్భజన్ ప్రశంసలు

ప్రస్తుతం ట్రావిస్ హెడ్ ఇలాగే దూకుడుగా ఆడుతున్నారు. ఇలాంటి ప్లేయర్లే ఆటను ముందుకు తీసుకెళతారు. త్వరలో అభిషేక్‌కు టెస్టు క్రికెట్‌లో అవకాశం దక్కనుంది. టెస్టుల్లో విధ్వంసక ఆటతీరుతో మ్యాచ్‌ని ప్రత్యర్థి చేతుల్లోంచి లాగేసుకునే సెహ్వాగ్ లాంటి మరో క్రికెటర్ ఎల్లప్పుడూ అవసరం. అలాంటి సత్తా అభిషేక్ శర్మకు ఉంది' అని హర్భజన్ వివరించాడు. అభిషేక్ మెరుపు ఇన్నింగ్స్‌లు ఆడటంతోపాటు అప్పుడప్పుడు తనలోని స్పిన్ నైపుణ్యాన్ని బయటపెడుతున్నాడు. ఇంగ్లాండ్‌తో ఐదో టీ20లో అభిషేక్ మెరుపు శతకంతోపాటు ఒక ఓవర్ బౌలింగ్ చేసి రెండు వికెట్లు పడగొట్టాడు. హర్భజన్ సింగ్ ఈ విషయాన్ని ప్రస్తావిస్తూ అతడికి కొన్ని సూచనలు చేశాడు. అభిషేక్‌లో మంచి లెగ్ స్పిన్నర్ దాగి ఉన్నాడని, బ్యాటింగ్ మీదే కాకుండా బౌలింగ్ స్కిల్స్ మెరుగుపర్చుకోవాలన్నాడు. 'అభిషేక్‌ను కలిసిన ప్రతిసారి బౌలింగ్ గురించే మాట్లాడతా. ఎందుకంటే అతనిలో స్పిన్నర్ దాగి ఉన్నాడు. అతడికి బ్యాటింగ్ అంటే ఇష్టం. కాబట్టి ఎలాగూ బ్యాటింగ్ సాధన చేస్తాడు. ఆ విషయంలో మరింత ఎదుగుతాడు. కానీ, బౌలర్‌గా మాత్రం ఇది సరిపోదు. అతడు చాలా ప్రాక్టీస్ చేయాలి. లెఫ్టార్మ్ స్పిన్నర్‌గా ఎదిగే క్వాలిటీస్ అతడిలో ఉన్నాయి. అతడిలో కష్టపడేతత్వం ఎక్కువ' అని హర్భజన్ సింగ్ పేర్కొన్నాడు.



## 9000 పరుగులు పూర్తి చేసిన ఆండ్రీ రస్సెల్



ప్రస్తుతం, టెస్ట్, వన్డేల కంటే ఎక్కువ టీ20 క్రికెట్ జరుగుతోంది. చాలా మంది అభిమానులు కూడా ఈ ఫార్మాట్ చూడటానికి ఇష్టపడుతున్నారు. అందుకే ఇప్పుడు చాలా దేశాలలో ప్రైవేట్ టీ20 టోర్నమెంట్లు జరుగుతున్నాయి. టీ20 క్రికెట్‌లో ఒకదాని తర్వాత ఒకటి భారీ రికార్డులు నమోదవడానికి ఇది కూడా ఒక పెద్ద కారణం. ఇటీవల కేకేఆర్ స్టార్ ఆటగాడు ఆండ్రీ రస్సెల్ తన పేరు మీద ఒక భారీ రికార్డును నమోదు చేసుకున్నాడు. నిజానికి, టీ20 క్రికెట్‌లో అతి తక్కువ బంతుల్లో 9 వేల పరుగులు పూర్తి చేసిన ఆటగాడిగా రస్సెల్ నిలిచాడు. దుబాయ్‌లో జరుగుతున్న అంతర్జాతీయ టీ20 లీగ్‌లోని 27వ మ్యాచ్‌లో ఆడుతున్నప్పుడు అతను ఈ ఘనతను సాధించాడు. టీ20 క్రికెట్‌లో అతి తక్కువ బంతుల్లో 9 వేల పరుగులు పూర్తి చేసిన వారిలో ఆండ్రీ రస్సెల్ ముందంజలో ఉన్నాడు. ఈ మైలురాయిని సాధించడానికి ఈ తుఫాన్ కుడిచేతి వాటం బ్యాట్స్‌మన్ 5321 బంతులను ఎదుర్కొన్నాడు. రస్సెల్ ఇప్పటివరకు ఆడిన 538 టీ20 మ్యాచ్‌ల్లో 26 కంటే ఎక్కువ సగటుతో 9008 పరుగులు చేశాడు. ఇందులో అతను 2 సెంచరీలు, 21 అర్ధ సెంచరీలు చేశాడు. ఈ జాబితాలో ఆస్ట్రేలియా స్టార్ బ్యాట్స్‌మన్ గ్లెన్ మాక్స్‌వెల్ రెండవ స్థానంలో ఉన్నాడు. మాక్స్వెల్ టీ20 ఫార్మాట్‌లో అత్యంత ప్రమాదకరమైన బ్యాట్స్‌మెన్‌లలో ఒకడిగా పేరుగాంచాడు. అతను ప్రపంచవ్యాప్తంగా వివిధ టీ20 లీగ్‌లలో నిరంతరం ఆడుతున్నాడు. టీ20 క్రికెట్‌లో 9000 పరుగుల మైలురాయిని దాటడానికి మాక్స్‌వెల్ 5915 బంతులు తీసుకున్నాడు. మాక్స్వెల్ ఇప్పటివరకు ఆడిన 459 మ్యాచ్‌ల్లో 10 వేలకు పైగా పరుగులు సాధించాడు.



## సచిన్, కోహ్లీ కాదు..
## కలిస్ గ్రేటెస్ట్ క్రికెటర్ : రికీ పాంటింగ్

ప్రపంచంలో అత్యుత్తమ క్రికెటర్ ఎవరు? అని అడిగితే చాలామంది సచిన్ తెందూల్కర్, ముత్తయ్య మురళీధరన్, వివి రిచర్డ్స్, గ్యారీ సోబర్స్, విరాట్ కోహ్లీ వంటి దిగ్గజ ఆటగాళ్ల పేర్లు చెబుతారు. లేకపోతే తమ దేశానికి ప్రాతినిథ్యం వహించిన గొప్ప ఆటగాళ్లను అత్యుత్తమ క్రికెటర్‌గా భావిస్తారు. కానీ, ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ రికీ పాంటింగ్ పైన పేర్కొన్న వారెవరి పేర్లను బెస్ట్ ప్లేయర్‌గా పరిగణించలేదు. అలా అని ఆసీస్ మాజీ క్రికెటర్ అలెన్ బోర్డర్, డాన్ బ్రాడ్‌మన్ పేర్లు చెప్పలేదు. ఇంతకీ పాంటింగ్ ఎవరి పేరు చెప్పాడో తెలుసా దక్షిణాఫ్రికా దిగ్గజ ఆల్‌రౌండర్ జాక్వెస్ కలిస్. 'జాక్వెస్ కలిస్ అత్యుత్తమ క్రికెటర్. మిగతా వారందరి సంగతి నాకు తెలియదు. నా వరకు అతనే గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్‌టైమ్ క్రికెటర్. టెస్టుల్లో 13,000 పరుగులు, 45 సెంచరీలు, 300 వికెట్లు. మిగతా వారు తమ కెరీర్‌లో బ్యాటింగ్‌లో లేదా బౌలింగ్ అత్యుత్తమ గణాంకాలను కలిగి ఉండవచ్చు. కలిస్ మాత్రం ఈ రెండింటిని కలిగి ఉన్నాడు. స్లిప్స్‌లో అతను అసాధారణ ఫీల్డర్. అతనికి తగినంత గుర్తింపు దక్కలేదు. ఎందుకంటే కలిస్ ఎక్కువగా మాట్లాడడు. అది అతని వ్యక్తిత్వం. అతడిని మీడియా ఎప్పుడూ హైలైట్ చేయలేదు' అని పాంటింగ్ వివరించాడు. కలిస్ తన 19 ఏళ్ల సుదీర్ఘ కెరీర్‌లో టెస్టులు, వన్డేల్లో ఎన్నో రికార్డులు సాధించాడు. 166 టెస్టులు ఆడిన ఈ దక్షిణాఫ్రికా ఆల్‌రౌండర్ 13,289 పరుగులు చేశాడు. సుదీర్ఘ ఫార్మాట్‌లో అత్యధిక పరుగులు చేసిన ఆటగాళ్లలో కలిస్‌ది మూడో స్థానం. సచిన్ (15,921 పరుగులు), పాంటింగ్ (13,378 పరుగులు) తొలి రెండు స్థానాల్లో ఉన్నారు. వన్డేల్లోనూ కలిస్‌కు అద్భుతమైన రికార్డు ఉంది. 328 మ్యాచ్‌ల్లో ఆడి 11,579 రన్స్ సాధించాడు. 519 అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడి 338 క్యాచ్‌లు అందుకున్నాడు.



# ఛాంపియన్స్ ట్రోఫీ..

## నిమిషాల్లోనే అమ్ముడైన టీమ్‌ఇండియా మ్యాచ్‌ల టికెట్లు

ప్రతిష్టాత్మక ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ ఆరంభానికి సమయం దగ్గర పడుతోంది. ఫిబ్రవరి 19 నుంచి ఈ మెగా టోర్నీ ప్రారంభం కానుంది. ఇప్పటికే అన్ని దేశాలు తమ జట్లను ప్రకటించాయి. ఫిబ్రవరి 11 వరకు టీమ్‌లలో మార్పులు, చేర్పులు చేసుకోవడానికి ఛాన్స్ ఇచ్చారు. మరోవైపు, ఈ టోర్నీలో భారత్ మ్యాచ్‌లన్నీ దుబాయ్‌లోనే జరగనున్నాయి. ఫిబ్రవరి 20న బంగ్లాదేశ్, 23న పాకిస్థాన్, మార్చి 2న న్యూజిలాండ్‌తో భారత్ తలపడనుంది. భారత్ ముందంజ వేస్తే తొలి సెమీఫైనల్ కూడా దుబాయ్‌లోనే జరుగుతుంది. ఈక్రమంలో భారత్ మ్యాచ్‌లకు సంబంధించిన టికెట్లను సోమవారం ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచారు. సాధారణ స్టాండ్ టికెట్ల ప్రారంభ ధర యూఏఈ దిర్హమ్‌లు 125 (సుమారు రూ. 2,965)గా నిర్ణయించారు. టీమ్‌ఇండియా ఆడే మ్యాచ్‌ల టికెట్లన్నీ హాట్‌కేకుల్లా నిమిషాల్లోనే అమ్ముడుపోయాయి. టికెట్స్ దక్కించుకున్నవారు ఆనందం వ్యక్తంచేయగా.. దక్కనివారు నిరాశ చెందారు.

### భారత్, పాక్ మ్యాచ్..
### టికెట్లు గంటలోనే

భారత్, పాకిస్థాన్ మ్యాచ్‌కు ఉండే క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. రెట్టింపు ధర చెల్లించైనా టికెట్లు దక్కించుకోవడానికి అభిమానులు ఏమాత్రం వెనకాడరు. ఛాంపియన్స్ ట్రోఫీ లాంటి మెగా టోర్నీలో మ్యాచ్ అంటే టికెట్ల డిమాండ్ ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. దుబాయ్ స్పోర్ట్స్ సిటీ క్రికెట్ స్టేడియం సామర్థ్యం 25,000 కాగా.. భారత్, పాక్ మ్యాచ్ టికెట్ల కోసం ఆన్‌లైన్‌లో సుమారు 1,50,000 మంది పోటీపడినట్లు సమాచారం. ఛాంపియన్స్ ట్రోఫీకి పాకిస్థాన్ ఆతిథ్యమిస్తుండగా.. భద్రతా కారణాలరీత్యా పాక్ వెళ్లడానికి టీమ్‌ఇండియా నిరాకరించింది. దీంతో టోర్నీని హైబ్రిడ్ మోడల్‌లో నిర్వహిస్తున్నారు. భారత్ ఆడే లీగ్ మ్యాచ్‌లతోపాటు సెమీ ఫైనల్, ఫైనల్ (క్వాలిఫై అయితే) దుబాయ్‌లోనే నిర్వహిస్తారు. మార్చి 9న ఫైనల్ మ్యాచ్ జరగనుంది.